ప్రజాశక్తి
శుక్రవారం 30 ఆగస్టు 2024
అనంతపురం





రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జి.ఓబులు

తాగునీటి కార్మికులపై నిర్లక్ష్యం తగదు

వేతనాల కోసం ప్రతి నెలా ప్రాధేయపడాల్సిన పరిస్థితి
5న కార్మికుల నిరవధిక సమ్మెకు ప్రజా కార్మిక సంఘాలు మద్దతు
రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు


ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతరం జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలోని శ్రీ సత్యసాయి, శ్రీరామ్‌రెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ చెల్లించకుండా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, తాగునీటి కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు జి.ఓబులు తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి, శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కారం, సెప్టెంబర్ 5నుంచి చేపడుతున్న నిరవధిక సమ్మెకు సంఘీభావంగా జెవివి జిల్లా కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని గురువారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఏసురత్నం, ఎఐటియుసి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు వికె.కృష్ణుడు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలరంగయ్య, సిఐటియు జిల్లా కోశాధికారి టి.గోపాల్, మున్సిపల్ ఉద్యోగుల కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, పట్టణ పౌర సంఘాల ఐక్యవేదిక నాయకులు శ్రీనివాసరావు తదితరులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ప్రజల దాహార్తి తీర్చడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రీ సత్యసాయి, శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకాలను పటిష్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రోజు రోజుకూ ఈ పథకాలకు నిధులు కేటాయింపుల్లో కోతలు విధిస్తున్నారని చెప్పారు. కార్మికుల కుదింపు కూడా చోటు చేసుకుంటోందని తెలిపారు. పనిచేసిన కార్మికులకు నెలలు తరబడి వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వాలు జాప్యం చేయడం అన్యాయంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో మూడు నెలలకు ఒకసారి రోడ్లెక్కి వేతనాల కోసం ఆందోళనలు చేయాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లు తాగునీటి పథకాలను పటిష్టంగా అమలు చేస్తామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కార్మికులకు తక్షణమే బకాయి వేతనాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. శాశ్వత ప్రాతిపదిగిన తాగునీటి పథకాలకు నికర బడ్జెట్ కేటాయించినా ప్రభుత్వాలు అలసత్వం వహించడం సరికాదన్నారు. తక్షణమే ప్రత్యేక బడ్జెట్ కేటాయించి తాగునీటి సరఫరా పథకాన్ని పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు నష్టం చేసేలా మోడీ చర్యలు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక రంగానికి తీవ్ర అన్యాయం చేస్తుందని కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. ప్రపంచీకరణ విధానాలను అమలు చేసి యాజమానులకు అనుకూలంగా చట్టాలు చేస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్ తీసుకొచ్చి కార్మికులను దోపిడీకి గురి చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను అతివేగంగా అమలు చేసి వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం కోల్పోయిందన్నారు. ఎన్డీఏ కూటమిలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాల కోసం, కార్మికులు రైతులు శ్రామికుల కోసం నిలబడాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఎంతో అవసరమని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు నష్టం చేకూర్చే విధానాలను విడనాడాలని కోరారు. తాగునీటి మోటార్లకు మీటర్లు బిగించే విధానం ఉపసంహరించు కోవాలన్నారు. తాగునీటికి మీటర్లు బిగిస్తే భవిష్యత్తులో ప్రజలపై తీవ్రమైన బారాలు పడే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ ఉద్యోగులు కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, ఆదినారాయణ, భగత్ సింగ్ ఆటో యూనియన్ ఎన్టీఆర్ శ్రీనివాసులు, శ్రీ సత్యసాయి శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ నాయకులు శ్రీనివాసులు, తిప్పేస్వామి, ఎర్రిస్వామి, నరేష్, ప్రభాకర్, మధు, సోమశేఖర్, ప్రసాద్, ఆచారి పాల్గొన్నారు.

'అనంత'లో క్రికెట్ పండుగ



ఆర్డీటీలో దులీప్ ట్రోఫీ
తరలిరానున్న టీం ఇండియా క్రికెటర్లు
సెపెంబర్ 5 నుంచి 19 వరకు మ్యాచ్‌లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరానికి అగ్రశ్రేణి క్రీడాకారులంతా రానున్నారు. సెపెంబరు 5 నుంచి 19వ తేదీ వరకు జరిగే దులీప్ ట్రోఫీ టోర్నమెంట్‌లో ఈ క్రికెటర్ల అందరూ ఆడనున్నారు. అనంతపురం స్పోర్ట్సు కాంప్లెక్సులోని రెండు గ్రౌండ్లలో జరిగే మ్యాచుల్లో ఈ క్రీడాకారులు ఆడనున్నారు. ఈ మేరకు అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్, దులీప్ ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు జరుగుతున్నాయి. బిసిసిఐ ప్రతినిధులు కూడా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లు వస్తుండటంతో వారికి తగ్గట్టు గ్రౌండ్లలోనూ మార్పులు చేర్పులతోపాటు, ఏర్పాట్లు చకచక చేపడుతున్నారు.

మ్యాచ్‌లు ఇలా జరుగనున్నాయి.

దేశవాళీ ప్రముఖ ఆటగాళ్లందరినీ ఎ,బి,సి,డి అని నాలుగు టీములుగా విడగొట్టారు. ఈ నాలుగు టీముల మధ్య సెప్టెంబరు 5వ తేదీ నుంచి మ్యాచులు ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు ఎ, బి జట్ల మధ్య మ్యాచ్ బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరుగనుంది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వంటి ప్రముఖ ఆటగాళ్లు ఆడనున్నారు భద్రతా తదితర కారణాల రీత్యా మ్యాచ్‌ను అక్కడే నిర్వహించనున్నారు. అదే రోజు అనంతపురం నగరంలోని ఆర్డీటీ స్పోర్ట్సు కాంప్లెక్సులోని అనంతపురం క్రికెట్ మైదానంలో సి, డి టీములు తలపడనున్నాయి. ఆ తరువాత సెప్టెంబరు 12 నుంచి 15వ తేదీ వరకు ఎ, డి టీములు ఒక మైదానంలో, బి,సి టీములు మరో మైదానంలో ఒకే సమయంలో మ్యాచ్ జరుగనున్నాయి. ఇక సెప్టెంబరు 19 నుంచి 22వ తేది వరకు ఎ,సి టీములు ఒక మైదానంలో , బి,డి టీములకు ఒక మైదానంలో మ్యాచ్ జరుగనుంది. అక్కడితో మ్యాచులు పూర్తవనున్నాయి.

రెండవ తేదీనే అనంతకు ఆటగాళ్ల రాక

పై మ్యాచుల్లో పాల్గొనే ఆటగాళ్లంతా సెప్టెంబరు రెండవ తేదీ నాటికే అనంతపురం నగరానికి చేరుకుంటారు. నగరంలోని రెండు ప్రధాన హోటళ్లలో వీరికి బస ఏర్పాట్లు చేపట్టారు. సెప్టెంబరు ఐదవ తేదీ నుంచి సెప్టంబరు 19వ తేదీ వరకు జరిగే టోర్నమెంట్‌లో పాల్గొనే ఆటగాళ్ల ఇక్కడ ఉండనున్నారు.

మ్యాచ్‌ల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - అనంతపురం

దేశీయ క్రికెట్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ వచ్చే నెల 5వ తేదీ నుంచి 22వ తేదీ వరకు అనంతపురం స్పోర్ట్స్ విలేజ్‌లో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) త్రీమెన్ కమిటీ మెంబర్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ వెల్లడించారు. దులీప్ ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కె.ఎస్.షాబుద్దీన్, ఏడీసీఏ కార్యదర్శి కె.మధు ఆచారి, కమిటీ సభ్యులు పగడాల మల్లిఖార్జున, జొన్న జయప్రకాశ్‌లతో కలిసి గురువారం అనంతపురం స్పోర్ట్స్ విలేజ్‌లో మాంచో ఫెర్రర్ మీడియాతో మాట్లాడారు. అనంతపురంలో మొత్తం 5 మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదేవిధంగా మ్యాచ్‌ల సందర్భంగా భారీ భద్రత కల్పించే విషయమై పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారన్నారు. మ్యాచ్‌ను తిలకించేందుకు ప్రతి రోజు 4 వేల పాసులు జారీ చేస్తామని ఈ పాస్‌ల జారీకి ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశామని వివరించారు. ఒక్కొక్కరికి ఒక్క పాస్ మాత్రమే ఇస్తామనిమ్యాచ్ రోజు ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు మాత్రమే పాస్‌లు ఉన్నవారిని అనుమతిస్తామని చెప్పారు.

స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

అనంతపురంలో నిర్వహించే దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారమవుతాయని మాంఛోఫెర్రర్ తెలిపారు. క్రికెట్ చూసేందుకు వచ్చే అభిమానుల వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్‌ను ఏర్పాటు చేస్తున్నామని క్యాంపస్‌లో స్నాక్స్ కౌంటర్‌ను కూడా అందుబాటులో ఉంచుతామని వివరించారు.

ఎసిఎ త్రీమెన్ కమిటీ మెంబర్ మాంఛో ఫెర్రర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాంఛోఫెర్రర్

ఒక్కో మ్యాచ్ నాలుగు రోజుల పాటు నిర్వహించే మ్యాచ్‌ల షెడ్యూల్ వివరాలు...

- సెప్టెంబర్ 5 నుండి 8వ తేదీ వరకు టీమ్ – సి, టీమ్ – డి మధ్య జరిగే మ్యాచ్ ఆర్డీటీ ఏ స్టేడియంలో జరుగుతుంది.
- సెప్టెంబర్ 12 నుండి 15 వరకు టీమ్– ఎ , టీమ్ – డి మధ్య జరిగే మ్యాచ్ ఆర్డీటీ ఏ స్టేడియంలో జరుగుతుంది.
- సెప్టెంబర్ 12 నుండి 15 వరకు టీమ్ – బి, టీమ్ – సి మధ్య జరిగే మ్యాచ్ ఆర్డీటీ బి స్టేడియంలో జరుగుతుంది.
- సెప్టెంబర్ 19 నుండి 22 వరకు టీమ్ – ఏ, టీమ్ – సి మధ్య జరిగే మ్యాచ్ ఆర్డీటీ ఏ స్టేడియంలో జరుగుతుంది.
- సెప్టెంబర్ 19 నుండి 22 వరకు టీమ్ – బి, టీమ్ – డి మధ్య జరిగే మ్యాచ్ ఆర్డీటీ బి స్టేడియంలో జరుగుతుంది.

టీమ్ - ఎ

శుభ్‌మన్ గిల్, మయాంక్ అగర్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, కేఎల్ రాహుల్, తిలక్ వర్మ, శివమ్ దూబే, తనుష్ కొటియన్, కుల్దీప్ యాదవ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధకృష్ణ, ఖలీల్ అహ్మద్, అవేష్ ఖాన్, విద్వాత్ కావరప్ప, కుమార్ కుశాగ్రా, శాశ్వత్ రావత్.

టీమ్ - బి

అభిమన్యు ఈశ్వరన్, యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, రిషబ్ పంత్, ముషీర్‌ఖాన్, నితీష్ కుమార్‌రెడ్డి, వాషింగ్టన్ సుందర్, నవదీప్ సైనీ, యశ్‌దయాల్, ముఖేష్ కుమార్, రాహుల్ చాహర్, సాయి కిషోర్, మోహిత్ అవస్తీ, జగదీశన్.

టీమ్ - సి

రుతురాజ్ గైక్వాడ్, సాయి సుదర్శన్, రజత్ పాటిదార్, అభిషేక్ పోరెల్, సుర్యకుమార్ యాదవ్, ఇంద్రజిత్, హృతిక్ షోకీన్, మానవ్ సుతార్, గౌరవ్ యాదవ్, వైషాక్ విజయ్ కుమార్, అన్షుల్ ఖాంబోజ్, హిమాన్షు చౌహాన్, మయాంక్ మార్కండే, సందీప్ వారియర్.

టీమ్ - డి

శ్రేయాస్‌అయ్యర్, అథర్వతైడే, యశ్‌దూబే, దేవదత్ పడిక్కల్, ఇషాక్ కిషన్, రికీ భుయ్, సరాంశ్ జైన్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, ఆదిత్య థాకరే, హర్షిత్ రాణా, తుషార్ దేశ్ పాండే, ఆకాష్ సేన్‌గుప్తా, సౌరభ్‌కుమార్.

హెచ్‌ఐవి, ఎయిడ్స్ పై అవగాహన అవసరం

కలెక్టర్ వినోద్ కుమార్



5కె రెడ్‌రన్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - అనంతపురం

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై యువతకు అవగాహన అవసరమని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ , జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆద్వర్యంలో యూత్ ఫెస్ట్ 2024–25 లో భాగంగా గురువారం 5 కె రెడ్ రన్ మారథాన్‌ను కలెక్టర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ 5 కె రెడ్ రన్ మారథాన్ ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ నుంచి ప్రారంభమై టవర్ క్లాక్ ,సప్తగిరి సర్కిల్ ,సర్వజన ఆసుపత్రి,కోర్టు రోడ్డు మీదుగా తిరిగి ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ చేరుకుంది. ఈ మారథాన్‌లో వివిధ కళాశాలలకి చెందిన 250 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతీయువకులు హెచ్‌ఐవి, ఎయిడ్స్ పై అవగాహన కలిగిఉండాలని అలాగే తమ మిత్రులకు, కుంటుంబ సభ్యులకు హెచ్‌ఐవి ఎయిడ్స్ పై అవగాహన కలిగించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ మాట్లాడుతూ హెచ్‌ఐవి ఎయిడ్స్ వ్యక్తుల పట్ల వివక్ష చూపకూడదని వారి పట్ల ప్రేమ,అబిమానాలు కలిగి ఉండాలని చెప్పారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఇబి. దేవిమాట్లాడుతూ హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అనుమానాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. అనంతరం ఈ 5 కె రెడ్ రన్ మారథాన్‌లో ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్. అనుపమ జేమ్స్, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వి. భాస్కర్; ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్. సుజాత , ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ దివాకర్ రెడ్డి, జిల్లా క్రీడాధికారి ఎస్‌కె . షఫీ , డిస్ట్రిక్ట్ సూపర్వైజర్ జివి. రమణ, రెడ్ రిబ్బన్ సమన్వయ కర్త డాక్టర్. గిరిధర్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.విష్ణుప్రియ తదితరులతో పాటు వివిధ కళాశాలల ఆధ్యాపకులు , జిల్లా స్పోర్ట్ విభాగానికి చెందిన శిక్షణ అధికారులు పాల్గొన్నారు.

'అనంత' మున్సిపల్ కమిషనర్‌గా జి.నాగరాజు

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా జి.నాగరాజు నియమితులయ్యారు. విశాఖపట్నం ఆర్డీగా పని చేస్తున్న ఈయన్ను అనంతపురం కమిషనర్‌గా నియమిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ స్పెషల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింగల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆన్ హిస్ పే కింద కార్పొరేషన్ కమిషనర్‌గా నాగరాజు నియమితులయ్యారు అలాగే అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అదనపు కమిషనర్ హరిబాబును చిలకలూరిపేట కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

'అనంత'ను కలిసిన స్టాండింగ్ కమిటీ సభ్యులు

అనంతపురం : ఇటీవల స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన నరసింహులు, రహంతుల్లా, అనిల్‌కుమార్‌రెడ్డి, సుజాత, నాగవినూత, తదితరులు మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని గురువారం ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. తమను స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని సూచించారు. నగరంలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చొరవ చూపాలని తెలిపారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి : ఎఓ

బ్రహ్మసముద్రం : వర్షాకాలంలో ఏఏ పంటలు సాగు చేయాలి.. ఏఏ ఎరువులు వేయాలనే జాగ్రత్తలను తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సరిత గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం కందిపంట శాఖీయ దశలో ఉన్నందున ముంపునకు గురై ఉంటే నీటిని తీయడంతోపాటు పొటాషియం నైట్రేటు 5 గ్రాములు ఒక లీటర్ నీటికి కలుపుకుని వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలన్నారు. అలాగే వేరుశనగ పంట పూత దశలో ఉన్నందున మురుగు నీటిని బయటికి పంపి పొలం ఆరిన తర్వాత అంతర సేద్యం చేసుకోవాలన్నారు. ఒకవేళ తెగులు ఉంటే హెక్సా కొనసాల్ ఒక మిల్లీలీటర్ నీటికి కలుపుకుని పిచికారి చేసుకోవాలన్నారు. సజ్జలో శనగ పచ్చపురుగు నివారణకు ఇమామేక్టిన్ బెంజోయెట్ 5గ్రా లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.

జెఎన్‌టియు ఎంటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎంటెక్ 1వ, 2వ సెమిస్టర్ రెగ్యులేషన్ (ఆర్.09), (ఆర్.17) (చివరి అవకాశం), ఎంబిఎ 1వ, 2వ, 3వ, 4వ సెమిస్టర్ రెగ్యులేషన్ (ఆర్.14), (ఆర్.17) (చివరి అవకాశం) పరీక్ష ఫలితాలను ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య ఆదేశాలతో గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ వి.నాగప్రసాద్‌నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఎపి.శివకుమార్, అడిషినల్ కంట్రోలర్లు జి.శంకర్, శేఖర్, రాజు, ఎం.అంకారావు, ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మంత్రి నారాయణకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

విజయవాడలోని సచివాలయంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, రాష్ట్ర యువజన క్రీడాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలోని డంపింగ్ యార్డు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, రోడ్లు, మున్సిపాలిటీ పరిధిలోని ఇతర సమస్యలను మంత్రి నారాయణకు వివరించారు. అదేవిధంగా అనంతపురంలోని ఇండోర్ స్టేడియం మరమ్మతులు, నూతన ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, పాతజిమ్‌ల మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని యువజన, క్రీడా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని కోరారు.

అలాగే జిల్లా కేంద్రంలో బిసి భవన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుని కలిసి విన్నవించారు. గతంలో బీసీ శాఖ మంత్రిగా పని చేసిన అనుభవం ఉన్న అచ్చెన్నాయుడు వెంటనే స్పందించి కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి స్థలసేకరణ పూర్తి చేసి, బడ్జెట్ ఎంత అవుతుంతో అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు.

జెఎన్‌టియులో తెలుగు భాష దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియూలోని పరిపాలన భవనంలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఓఎస్‌డి ఎన్.దేవన్న మాట్లాడుతూ గిడుగు వెంకట రామమూర్తి తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు పిఆర్.భానుమూర్తి, పి.సుజాత, ఎన్.విశాలి, బి.ఈశ్వర్‌రెడ్డి గ్యారీ, ఎస్‌వి.సత్యనారాయణ, కిరన్మయి, విబి.చిత్ర, ఎ.సురేష్‌బాబు, పద్మ సువర్ణ, ఎం.రామశేఖర్‌రెడ్డి, ఎపి శివకుమార్, పిఆర్‌ఒ బి.ఓంప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవం

జెఎన్‌టియూలోని క్రీడా మైదానంలో ఉన్న బాస్కెట్‌బాల్ కోర్టులో సుప్రసిద్ధ భారతీయ హాకీ ఆటగాడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ధాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి.జోజిరెడ్డి, ఉప కులపతి ఓఎస్‌డి దేవన్న, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి.జోజిరెడ్డి, పిఆర్‌ఒ బి.ఓంప్రకాష్, సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

పరిశ్రమల స్థాపనకు కృషి : కలెక్టర్



తిమ్మసముద్రం గ్రామ పరిసరాల్లో ఎపిఐఐసి భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కళ్యాణదుర్గం : తిమ్మసముద్రం రెవెన్యూ పరిధిలో సేకరించిన భూముల్లో పరిశ్రమలు స్థాపించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని తిమ్మసముద్రం రెవెన్యూ గ్రామ పరిధిలో 2010వ సంవత్సరవంలో అప్పటి ప్రభుత్వ సేకరించిన 1035ఎకరాల ప్రభుత్వ భూమిని కలెక్టర్ పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయా భూముల్లో పరిశ్రమలు స్థాపించేందుకు ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయనే అంశాలపై స్థానిక ఆర్‌డిఒ రాణిసుస్మిత, తహశీల్దార్ భాస్కర్‌తో కలిసి చరించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం సోలార్ పార్క్, కుటీర పరిశ్రమలు నెలకొల్పేందుకు అణువుగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా తాగునీరు, ప్రధాన రహదారులు రోడ్డు, తదితరు చర్చించారు. ప్రభుత్వ భూములు ఇతరుల ఆక్రమణలో ఉన్నాయా..లేక ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయనే అంశాలను ఆర్‌డిఒను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రయోజనాల కోసం ఈ భూముల్లో కుట్టిన పరిశ్రమలు, తదితర పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం సలహాలు చేస్తుందని అంశాలను తెలిపారు. ఆయా భూములపై ప్రత్యేక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు.

ఎరువులు కొన్న రైతులకు బిల్లులు ఇవ్వాలి

ఆత్మకూరు : దుకాణాల్లో ఎరువులు కొన్న రైతులకు తప్పనిసరిగా అందుకు సంబంధించిన బిల్లులను ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జువారి ఫాంహబ్‌ను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులు, స్టాకును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఏ ఎరువులు కొన్నా అందుకు సంబంధించిన బిల్లును తప్పనిసరిగా అందజేయాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే నాణ్యమైన ఎరువులనే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ వెంకట్‌కుమార్, ఎంఎఒ సుచరిత పాల్గొన్నారు.

తిరుపతి-కదిరిదేవరపల్లి రైలు పాక్షిక రద్దు గడువు పొడిగింపు

రాయదుర్గం : కదిరిదేవరపల్లి నుంచి రాయదుర్గం మీదుగా తిరుపతికి ప్రయాణిస్తున్న రైలు (07589/07590) వచ్చేనెల 1వ తేదీ నుంచి అక్టోబర్ 1వతేదీ వరకూ పాక్షిక రద్దు గడువును పొడిగించనున్నట్లు నైరుతి రైల్వే చీఫ్ ప్యాసింజర్ ట్రాఫిక్ మేనేజర్ బిఎల్.శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం కదిరిదేవరపల్లె నడుమ రైలు మార్గం మరమ్మతులు కొనసాగుతున్న కారణంగా జనవరి 1వ తేదీ నుంచి ఆగస్టు నెలాఖరు వరకూ కదిరిదేవరపల్లి నుంచి గుంతకల్లు నడుమ సర్వీసును నడపడం నిలిపివేశారు. కేవలం గుంతకల్లు–తిరుపతి నడుమ మాత్రమే ఈ రైలు ప్రయాణించేది. కాగా మరమ్మతులు పూర్తికానందున మరో నెల రోజులపాటు పాక్షిక రద్దు గడువును పొడిగించనున్నట్లు తెలిపారు.

తాడిపత్రి రూరల్ సిఐగా శివగంగాధర్‌రెడ్డి

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి రూరల్ అప్‌డేట్ పోలీస్‌స్టేషన్ సీఐగా శివగంగాధర్‌రెడ్డి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా అనంతపురం ఏసీబీలో విధులు నిర్వహిస్తూ బదిలీపై తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ లక్ష్మీకాంత్ రెడ్డిని అనంతపురం వీఆర్‌కు అటాచ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



పొలాల్లోకి దూసుకెళ్లిన వాహనం

పామిడి : స్థానిక చైతన్య కాలనీ బైపాస్ రోడ్డు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. పలువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... గార్లదిన్నె మండల పరిధిలోని కల్లూరుకు చెందిన అన్నదమ్ములు చిన్న (28), సాయి(26) కలిసి కల్లూరులో ఫొటో స్టూడియో పెట్టుకుని జీవనం సాగించేవారు. ఇందులో భాగంగానే పామిడిలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్తుండగా చైతన్య కాలనీ సమీపంలోకి రాగానే మధ్యప్రదేశ్ నుంచి కేరళకు కూలీలతో కలిసి వెళ్తున్న తుఫాన్ వాహనానికి కుక్క అడ్డురావడంతో తప్పించబోయి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108 ద్వారా పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే సాయి అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చిన్న పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. కాగా తుఫాను వాహనంలో 25 మంది ప్రయాణిస్తుండగా పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎస్ఎంసి చైర్మన్‌లుగా ప్రకాష్‌నాయుడు, ప్రసాద్

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాల ఎస్ఎంసి చైర్మన్‌లుగా ప్రకాష్‌నాయుడు, ఆలమూరు ప్రసాద్ ఎన్నికయ్యారు. గురువారం స్థానిక పాఠశాలల్లో విద్యా కమిటీల ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే వైస్ చైర్మన్‌లుగా అనసూయమ్మ, కడదల సునీతను ఎన్నుకున్నారు. నూతన చైర్మన్, వైస్‌చైర్మన్లను విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేష్, రవికుమార్, టిడిపి నాయకులు ఆలం వెంకట నరసనాయుడు, ఆకుల ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, ఆకుల విజయకుమార్ (బాబు), నాగార్జుననాయుడు, ఆకుల అనిల్, సుల్తాన్‌పేట మహేష్‌నాయుడు, టిడిపి యువత నాయకుడు చంద్రబాబు, ఆకుల తేజ, మాజీ జడ్పిటిసి జాఫర్‌వలి, మాజీ ఎంపిటీసీ రాజన్న, ప్రసాద్‌నాయుడు, శివ, పి.ఎల్. లక్ష్మీనారాయణ, నాగభూషణం, ఇస్మాయిల్, ప్రదీప్, తేజ, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.


పాఠశాల కమిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

'సత్యసాయి' కార్మికుల జలదీక్ష

ప్రజాశక్తి-పామిడి

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం పట్టణంలోని పెన్నానదిలో జలదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని వాపోయారు. ఇప్పటికైనా వేతనాలు చెల్లించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా 11 నెలల పీఎఫ్ చెల్లించాలని, ఇఎస్ఐ సౌకర్యం కల్పించలేదని, వేతనాలు పెంచాలని కోరారు. ముఖ్యంగాకార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కృష్ణమూర్తి ఆచారి, బాషా, నాగభూషణం, రాజు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : పెండింగ్ వేతనాలను మంజూరు చేయాలని, సత్యసాయి నీటి పథకానికి నిధులు కేటాయించాలని చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం మండల కేంద్ర సమీపంలోని పెన్నానదిలో కార్మికులు జలదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, బాషా, మల్లారయుడు, శ్రీనివాసులు, నాగార్జున, నాగేశ్వరరావు, శంకరం, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

నార్పల : మండలంలోని బి.పప్పూరు పంప్‌హౌస్ కార్మికులు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతోపాటు పథకం మరమ్మతులకు నిధుల ఉకేటాయించకపోవడం బాధాకరమన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నాగభూషణ, అంకన్న, పుల్లానాయుడు, శరత్‌బాబు, శ్రీరాములు, చంద్రమోహన్, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.


పామిడి మండలం వద్ద పెన్నానదిలో జలదీక్ష చేస్తున్న కార్మికులు


బి.పప్పూరు వద్ద ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న కార్మికులు

నేడు పల్లె ఉమ వర్ధంతి


పల్లె ఉమ (పాతచిత్రం)

అనంతపురం : మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమ 6 వర్ధంతిని శుక్రవారం స్థానిక జాతీయ రహదారి సమీపంలోని పల్లె ఫామ్‌హౌస్‌లో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పల్లె రఘునాథరెడ్డితోపాటు కుమారుడు పల్లె కిశోర్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, బాలాజీ విద్యాసంస్థలతోపాటు పిఎస్‌కె కళాశాలల సిబ్బంది నివాళులు అర్పించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. పుట్టపర్తి నియోజకవర్గం నుంచి ప్రజలు భారీగా తరలిరానున్నారు. ఈ సందర్భంగా అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

31న పింఛన్ల పంపిణీ

పుట్లూరు : ఈనెల 31వ తేదీనే (శనివారం) సామాజిక పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1న ఆదివారం సెలవు కావడంతో ప్రభుత్వం నిర్ణయం మేరకు ఒకరోజు ముందే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

యల్లనూరు : ఈనెల 31వ తేదీనే పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు ఎంపిడిఒ వీరరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1వతేదీ ఆదివారం సెలవు కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

బెలుగుప్ప : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఈనెల 31వ తేదీనే పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ రామచంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ పోటీలకు 'ఆర్యన్' విద్యార్థులు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ఆర్యన్ పాఠశాల యాజమాన్యం

అనంతపురం : నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఆర్యన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న అఖిలేష్, కళ్యాణ్, ఈశ్వరసింహ జాతీయ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు వీరు ఈనెల 30వ తేదీ నుంచి రాయచోటిలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు ఆర్యన్ స్కూల్ డైరెక్టర్లు నాగరాజు, సందీప్, ప్రిన్సిపల్ సైకాలజిస్ట్ లహరి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు క్రీడలు శారీరక మానసిక ఎదుగుదలకు ఉపయోగపడతాయన్నారు. పిల్లల పరిపూర్ణ ఎదుగుదలకు క్రీడల పాత్ర ఉంటుందన్నారు. ఈమేరకు పాఠశాలలోని వ్యాయామ ఉపాధ్యాయులు హుస్సేన్, ఉపాధ్యాయుల బృందం విద్యార్థులను అభినందించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి-ఆత్మకూరు

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ వెంకటేష్‌నాయక్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని కళ్యాణదుర్గం-అనంతపురం ప్రధాన రహదారిపై తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా వాహనదారులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించుకోవాన్నారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించిన అతివేగంగా వాహనాలు నడిపినా, లైసెన్స్ లేకుండా ఆటోలు, ట్రాక్టర్లు నడిపినా, ఓవర్‌లోడ్‌తో వెళ్లినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌ఇబ్బంది పాల్గొన్నారు.

ట్రెల్లిస్ స్కూల్‌కి ప్రతిష్టాత్మక అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం



అవార్డు అందుకుంటున్న ట్రెల్లిస్ పాఠశాల చైర్మన్ శ్రీకాంత్ వడ్ల

భారతదేశంలోని ప్రముఖ మీడియా సమ్మేళనాల్లో ఒకటైన టైమ్స్ ఆఫ్ ఇండియా నుంచి ఎక్సలెన్స్ ఇన్ స్కూల్ ఎడ్యుకేషన్ అవార్డు ట్రెల్లిస్ స్కూల్‌కు రావడం గర్వంగా ఉందని వ్యవస్థాపకులు, పాఠశాల చైర్మన్ శ్రీకాంత్ వడ్ల తెలిపారు. ఈమేరకు విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి ట.జి.భరత్‌తో అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైమ్స్ ఆఫ్ ఇండియా నుంచి ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ గుర్తింపు తమ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది చేసిన కృషి, అంకితభావానికి నిదర్శనమన్నారు.

ఎఫ్‌పిఒ వార్షిక మహాసభ

బెలుగుప్ప : మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి ఏఎఫ్ ఎకాలజీ ఫీల్డ్‌లో అధ్యక్షురాలు అక్కులమ్మ ఆధ్వర్యంలో ఎఫ్‌పిఒ 8వ వార్షిక మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎఫ్ ఎకాలజీ సెంట్రల్ కార్యాలయం నుంచి ఎఎల్‌పి కో ఆర్డినేటర్ రిజ్వానా, ఎఫ్‌పిఒ టీమ్ లీడర్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ దళారులు, వ్యాపారులు, మధ్యవర్తుల చేతిలో రైతులు మోసపోకుండా వాటాదారులు పండించిన పంటను బెళుగుప్ప ఎఫ్‌పిఒ తరుపున ఉమ్మడిగా సేకరించి టోకు ధరలకు అమ్ముతున్నట్లు తెలిపారు. వచ్చిన లాభాలను వాటాదారులకు బోనస్ రూపంలో రైతులకు ఇస్తున్నట్లు వివరించారు. వీటితోపాటు అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎల్ భవాని, ఎఫ్‌పిఒ మేనేజర్ రమేష్, సిఇఒ హరీష్ పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాల్లో జాగ్రత్తలు పాటించాలి

అనంతపురం : రైతుసేవా కేంద్రం సిబ్బంది పంట కోత ప్రయోగాలు చేపట్టే సమయంలో జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో పంటకోత ప్రయోగాలపై శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా పొలంలో పాటించిన నియమ, నిబంధనలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ కళ్యాణి, వ్యవసాయ విస్తరణ అధికారులు బి.మురళీకృష్ణ, అలేఖ్య, శిరీషా, తదితరులు పాల్గొన్నారు.

యువత సేవాగుణం అలవర్చుకోవాలి

అనంతపురం : యువత విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని అర్బన్ బ్యాంకు చైరన్ జెఎల్.మురళి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని సుభాష్ రోడ్డులో ఉన్న శ్రీకృష్ణదేవరాయ భవన్‌లో కేరళ రాష్ట్రంలోని వయనాడు బాధితుల కోసం ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సేకరించిన విరాళాలను అర్బన్ బ్యాంకు పాలకవర్గ సమక్షంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజసేవలో నేటితరం యువత సమర్థవంతంగా పోషించాలన్నారు. ఎక్కడో జరిగిన ప్రకృతి వైపరీత్యాలను తమవంతు బాసటగా నిలవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.విష్ణుప్రియ, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు సుంకర రమేష్, అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్ వెంకటాద్రి, డైరెక్టర్లు ఎం.చంద్రశేఖర్, రొళ్ల భాస్కర్, మధుసూదన్‌గౌడ్, పసుపులేటి రమేష్, మార్కెట్ శ్రీధర్, అనిల్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించం

తాడిపత్రి : మున్సిపల్ పరిధిలోని అనధికారికంగా వేసిన లేఅవుట్లలో ఎలాంటి మౌలిక వసతులు కల్పించమని మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా స్థానిక యల్లనూరు రోడ్డులోని సర్వేనెంబర్ 743-బిలోని 2.02 ఎకరాలు, టీచర్స్ కాలనీలో సర్వేనెంబర్ 620-బిలో 1.50 ఎకరాలు, కృష్ణాపురం ఎక్స్‌టెన్షన్‌లో సర్వేనెంబర్ 736-ఏలో 0.50 ఎకరాల్లో వేసిన లే అవుట్లకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. అలాగే ప్రజలు కూడా అనుమతులు లేకుండా వేసిన లే అవుట్లలో ప్లాట్లు కొని మోసపోవద్దన్నారు.

కంపచెట్ల తొలగింపు

బ్రహ్మసముద్రం : రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లను గురువారం జెసిబితో తొలగించినట్లు మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు తెలిపారు. పాల వెంకటాపురం నుంచి గొల్లపల్లి వరకూ కంపచెట్లు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో జెసిబి ద్వారా తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు హనుమంతు, వడ్డే నారాయణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పయ్యావుల' కాలనీ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండ పట్టణంలోని కొలిమి, రాయంపల్లి లేఅవుట్లకు పయ్యావుల కేశవ్ కాలనీలుగా పేరు మార్చేందుకు తీర్మానం చేయాలని పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్‌కు టిడిపి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈమేరకు గురువారం ఉరవకొండలో పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిని కలిసి చర్చించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ మంత్రి పయ్యావుల కేశవ్ గతంలో ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు గత ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నియోజకవర్గంలో భూ సేకరణ చేపట్టారన్నారు. దీనికితోడు 16 వేల ఇళ్లు మంజూరు చేయించి 2018-19లో మంజూరు చేయించారన్నారు. దీంతో అప్పట్లో స్థానికుల కోరిక మేరకు పయ్యావుల కేశవ్ కాలనీ పేరును ప్రతిపాదించి అప్పటి ప్రత్యేక అధికారి ఏ.లోకన్న ఆమోదించిన విషయాన్ని గుర్తు చేశారు. వెంటనే అధికారులు స్పందించి కొలిమి లే అవుట్‌కు పయ్యావుల కేశవ్ కాలనీ, రాయంపల్లి లేఅవుటుకు పయ్యావుల కేశవ్ కాలనీ-2గా మార్చేందుకు తీర్మానం చేసి స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మండల టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో రూరల్ ఇఇగా శ్రీరాములు

అనంతపురం : అనంతపురం రూరల్ ట్రాన్స్‌కో ఇఇగా శ్రీరాములు గురువారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఎంక్వైరీస్ డిఇగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై అనంతపురం వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఇ సంపత్‌కుమార్, ఇఇ రమేష్, డిప్యూటీ ఇఇ శ్రీనివాస్, జెఎఒ గంగన్నతోపటు విద్యుత్ శాఖ అధికారులు అభినందనలు తెలిపారు.

సామూహిక సీమంతాలు

యల్లనూరు : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గురువారం సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని 46 అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 50 మంది గర్భిణులకు చీర, పసుపు, కుంకుమ అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఇఒఆర్‌డి విజయ శేఖర్‌నాయుడు, ఆర్ఐ హరిప్రసాద్, సిడిపిఒ భారతి, సూపర్‌వైజర్ రాజామణి, అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీలు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యంపై అవగాహన అవసరం

బుక్కరాయసముద్రం : కౌమార దశలో బాలికలకు ఆరోగ్యంపై అవగాహన చాలా అవసరమని మండల వైద్యాధికారి డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న డాక్టర్ అంబేద్కర్ బాలికల గురుకుల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18ఏళ్లు, మగ పిల్లలకు 21ఏళ్లు పూర్తయిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. లేనిపక్షంలో చట్టరిత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.పర్వీన్, సూపర్‌వైజర్లు కేశవయ్య, శ్రీదేవి, ఆరోగ్య కార్యకర్తలు రాజేంద్రప్రసాద్, ఎస్.రామలక్ష్మి, ఆశా కార్యకర్త తిరుపాలమ్మ, గురుకుల పాఠశాల స్టాఫ్‌నర్సు మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

అనంతపురం : నగరంలోని త్రివేణి ఆగ్రో ఏజెన్సీస్, విష్టా అగ్రి గ్రీన్ ప్రయివేట్ లిమిటెడ్ అవుట్ లెట్‌లో వ్యవసాయ అధికారిణి జె.శశికళతో కలిసి ఎడిఎ ఎం.రవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టాక్ రిజిస్టర్, ఇన్ వాయిస్, ఎరువుల నిల్వల్లో తేడాలు ఉండటంతో రూ.15 లక్షలు విలువజేసే ఎరువులను సీజ్ చేసినట్లు ఎడిఎ తెలిపారు.

ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా బి.శ్వేత

గుత్తి : జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా బి.శ్వేత గురువారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్రంలోని సూర్యాపేట మండలం లాల్ తండాకు చెందిన శ్వేత న్యాయమూర్తిగా ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. దీంతో జుడిషియల్ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'జిందాల్'లో స్థానికులకు ఉద్యోగాలివ్వాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని అరేసముద్రం పరిధిలో ఉన్న జిందాల్ ఐరన్ కర్మాగారంలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని మాజీ సర్పంచి తిప్పేస్వామి కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాతవాహన యాజమాన్యం నుంచి జిందాల్ యాజమాన్యం కొనుగోలు చేసే సమయంలో స్థానికంగా ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా చదివిన నిరుద్యోగులకు 30శాతం స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. దీనికితోడు ప్రతి సంవత్సరం 20 శాతం నిధులు ఖర్చు చేసి పరిసర గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. అయితే ఏ ఒక్కటీ అమలు చేసిన పాపానపోలేదన్నారు. ఇప్పటికైనా కర్మాగారం యాజమాన్యం స్పందించి స్థానికులకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు సుంకన్న, హనుమంతప్ప, వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు

బుక్కరాయసముద్రం పాఠశాలకు క్రీడా ప్రతిభా అవార్డు

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని ప్రభుత్వం పాఠశాలకు స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ క్రీడా ప్రతిభ అవార్డు లభించింది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు అనంతపురంలోని కలెక్టరేట్‌లో ఉన్న రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, డిఆర్ఒ రామకృష్ణారెడ్డి, డిఇఒ వరలక్ష్మితో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు నాగరాజ్‌గౌడ్, పీడీలు గోపాల్‌రెడ్డి, లలితమ్మ గురువారం అవార్డును అందుకున్నారు.

జాతీయ క్రీడా దినోత్సవం

రాయదుర్గం : రాయదుర్గంలోని సరస్వతి శిశుమందిరంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సీతను రాముడు కనిపెట్టుట, చదరంగం, అష్టాచెమ్మ, గోలీలాట, వామన గుంతలు, తొక్కుడు బిళ్ల, తాడు ఆట, మేక పులి, క్యారమ్స్, దాగుడుమూతల వంటి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని రాజేశ్వరి, ఉపాధ్యాయులు చంద్రకళ, మహాదేవి, అనసూయమ్మ, శృతి, భవాని, వందన, తులసీ, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

పుట్లూరు : కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని వైసిపి నాయకులు ఆలూరు సాంబ శివారెడ్డి భరోసా ఇచ్చారు. ఈమేరకు గతనెల జూన్ 27న టిడిపి కార్యకర్తల దాడిలో మృతిచెందిన వైసిపి నేత ఎరికలయ్య (55) కుటుంబానికి మాజీ ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఈమేరకు తక్షణ సాయం కింద గురువారం రూ.లక్షను కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి ఎరికలయ్య కష్టపడి పని చేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. రానున్న రోజుల్లో ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూమిరెడ్డి గారి రాఘవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులుగా రమేష్

వజ్రకరూరు : దళిత, గిరిజన హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా రేణుమాకులపల్లి సాకే బి.రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గోపాల్ తెలిపారు. గురువారం ఉరవకొండ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోపాల్ మాట్లాడుతూ సంఘం బలోపేతం చేయడంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షులుగా రమేష్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాసాపురం మహేష్, వెలుగొండ నాగరాజు, రాయంపల్లి రాజేష్, చాబాల నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ తప్పనిసరి

బ్రహ్మసముద్రం : సెక్టార్ పరిధిలోనే అంగన్వాడీ కార్యకర్తలు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఖాసింబీ సూచించారు. గురువారం మండల కేంద్రంలో సెక్టార్ కార్యకర్తతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కర్యకర్త రోజువారి, నెలవారీ నివేదికలు తప్పనిసరిగా సమర్పించాలన్నారు. రికార్డుల నిర్వహణలో ప్రతి ఒక్కరూ ముందుండాలన్నారు. అలాగే కేంద్రాలను ఉదయం 9 గంటలకే తెరిచి సాయంత్రం 4గంటల వరకూ నిర్వహించాలన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

పుట్లూరు : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. గొడవలు జోలికి వెళ్లకుండా ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే సున్నిత గ్రామాలపై నిరంతరం నిఘా ఉంచాటన్నారు. ముఖ్యంగా కోమటికుంట్ల, ఎస్.గూడూరు తదితర గ్రామాల్లో గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హేమాద్రి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

గుత్తి : ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా ఉపకారగారం అధికారి అనిల్‌బాబు సూచించారు. గురువారం స్థానిక ప్రత్యేక ఉపకారాగారంలో హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం ఖైదీలకు సిబిఎస్, హైపటైటిస్ బి,సి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపకారాగారం సూపరింటెండెంట్ వి.మహేశ్వరుడు, రాజబాబు, హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ టిఐ ప్రాజెక్టు మేనేజర్ జి.రమేష్, సిబ్బంది సందీప్‌కుమార్, ఎన్.కవిత, జి.రాజకుమారి, పిపిఎం రాజు, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అతిథులు

నేరాలు ఘోరాలు

తాగుబోతుల వీరంగం..ఐదుగురిపై దాడి

గుత్తి : పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న కల్లు దుకాణం వద్ద ఇద్దరు తాగుబోతులు వీరంగం సృష్టించారు. పట్టణానికి చెందిన గంగరాజు, దేవా మద్యం మత్తులో కల్లు దుకాణం వద్దకు వెళ్లారు. అక్కడ దుకాణదారుడు శ్రీరాములును తాగడానికి కల్లు అడిగారు. అయితే కాసేపు కూర్చోమని చెప్పినందుకు గంగరాజు, దేవా కలిసి శ్రీరాములు అతని కుమార్తె లీలావతి, కుమారుడు జనార్ధన్‌పై రాళ్లు, కర్రలతో దాడి చేసి గాయపరిచారు. సర్ది చెప్పడానికి వెళ్లిన హోటల్ నిర్వాహకులు సంజీవ రాయుడు, మల్లీశ్వరిపై కూడా దాడి చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయురాలిపై తల్లిదండ్రుల ఫిర్యాదు

గుత్తి : పట్టణంలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని ఉపాధ్యాయురాలు తీవ్రంగా కొట్టి గాయపరిచింది. జెడ్.వీరారెడ్డి కాలనీకి చెందిన అశోక్, అనిత దంపతుల కుమారుడు శివసాయి వివేకానంద ఉన్నత పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. గురువారం హోమ్‌వర్క్ చేసుకు రాలేదని విద్యార్థిని భారతి అనే ఉపాధ్యాయిని వీపుపై బెత్తంతో కొట్టింది. పాఠశాల నుంచి రోదిస్తూ ఇంటికి వెళ్లిన తమ కుమారుని వీపుపై ఉన్న వాతలను చూసి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. టీచర్‌పై చర్యలు చేపట్టాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని తాడిపత్రి-పెద్దపప్పూరు ప్రధాన రహదారిపై జూటూరు తిమ్మనచెరువు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని సింగనమంటపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు, భాస్కర్ ద్విచక్ర వాహనంలో తాడిపత్రికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. వెంటనే స్థానికులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గౌషబాషా ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్యకేసులో నిందితులు అరెస్టు : సిఐ

బెలుగుప్ప : తండ్రిని చంపిన కేసులో కొడుకుతోపాటు తల్లిని గురువారం స్థానిక గుండ్లపల్లి క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు సిఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ మండల పరిధిలోని ఎలగలవంక తండాలో తిప్పేస్వామి నాయక్ (53) అతిగా మద్యం తాగి భార్య లక్ష్మీబాయి, కొడుకు రాజశేఖర్‌నాయక్‌తో గొడవ పడ్డాడు. రోజూ కూడా ఇలాగే గొడవపడేవారు. ఈనేపథ్యంలో ఉన్న ఒక్క ఎకరం పొలాన్ని అమ్మి అప్పుల వాళ్లకి కడితే ఎలా బతకాలని తండ్రిని నిలదీశాడు. దీంతో కొడుకుపై దాడికి దిగాడు. దీంతో తిప్పేస్వామి నాయక్‌పై కొడుకు రాజశేఖర్‌తోపాటు తల్లి లక్ష్మీబాయి ఎదురు తిరిగి పిడుగుద్దులు గుద్దుతూ గొంతుపై, ఎదపైన కాళ్లతో తొక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. ఈనేపథ్యంలో నిందితులను గుండ్లపల్లి క్రాస్ దగ్గర అరెస్ట్ చేసి రిమాండ్ తరలించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివ, ఏఎస్ఐ రామదాసు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాష దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని గురువారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగపు అధ్యక్షులు డాక్టర్ బి.హేమమాలి మాట్లాడుతూ గిడుగు రామమూర్తి వ్యవహారిక భాష ఉద్యమానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా సంరక్షణ సమితి అధ్యక్షులు బి.నారాయణ తెలుగు అధ్యాపకులు జి.మాధవీలత, యోగేశ్వర్‌నాయుడు, అంకే మదన్‌మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే సంసిద్ధ్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ మధునిక, తెలుగు ఉపాధ్యాయులు రాజశేఖర్, వీరనారప్ప, హలీమా, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన తెలుగు భాషా దినోత్సవం వేడుకలను ఎజిఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగు భాష ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం తెలుగుభాషకు సంబంధించి విద్యార్థులతో చేయించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, అకడమిక్ కోఆర్డినేటర్ ఇర్షాద్, ఎఒ గోపాల్, డీన్‌లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, ఇన్‌ఛార్జిలు నీరజ, భారతి, మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ప్రిన్సిపల్ సిస్టర్ సెల్వా మేరీ అధ్యక్షతన తెలుగు బాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వాడుక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షులు టివి.రెడ్డి, జిరసం సలహాదారులు కంబదూరు షేక్ నబిరసూల్, మహాబోధి సంస్థ అధ్యక్షులు దాసన్న గారి కృష్ణమూర్తి, ఆశ్రయ అనాథాశ్రమం నిర్వాహకులు ఎర్రగుంట కృష్ణారెడ్డి, వేడుక నిర్వాహకులు ఎం.గాయత్రి, తెలుగు వెలుగు మహిళా కార్యదర్శి వి.రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



సంసిద్ధ్ పాఠశాలలో తెలుగు దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న యాజమాన్యం

స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పిడుగురా రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర బుక్‌హౌస్ సిబ్బంది పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్, సిఎన్.శ్రీనివాసులు, సి.రమేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.





పుట్టపర్తి నియోజకవర్గం

అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

3వ పేజీ

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక

ప్రత్యేక అనుబంధం

పుట్టపర్తి

శ్రీ సత్యసాయి జిల్లా

8 పేజీలు శుక్రవారం 30-08-2024







తాడేపల్లిలోని ప్రజాశక్తి ప్రధాన కార్యాలయం



తెలుగు నేలపై ప్రారంభమైన మొట్టమొదటి దినపత్రిక ప్రజాశక్తి. 1942లో వారపత్రికగా ప్రారంభమై 45లో దినపత్రికగా ఎదిగింది. ఇప్పటికి ప్రజాశక్తి స్వర్ణోత్సవాన్ని కూడా పూర్తి చేసుకుని 79 ఏళ్లుగా పురోగమిస్తోంది. ఈ 79 ఏళ్ల గమనంలో అనేక ఆటుపోట్లను, ఎత్తుపల్లాలనూ అధిగమించింది. 44 ఏళ్ల క్రితం ప్రజాశక్తి దినపత్రికగా పున:ప్రారంభమై నాలుగు దశాబ్ధాలు పూర్తి చేసుకుని 44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సమయం ఇది. ప్రారంభమైంది మొదలు పాఠకుల ఆదరణ, శ్రేయోభిలాషుల సహకారంతో అప్రతిహతంగా పురోగమిస్తోంది. ప్రజా ఉద్యమంలోనూ, పత్రికా రచనల్లోనూ సవ్యసాచిలా రాణించిన మోటూరు హనుమంతరావు సంపాదకత్వంలో, మహానేత పుచ్చలపల్లి సుందరయ్య దార్శనికతలో 1981 ఆగస్టు 1న విజయవాడ కేంద్రంగా ప్రారంభమైన ప్రజాశక్తి అనతి కాలంలోనే ఉమ్మడి రాష్ట్రంలో 10 కేంద్రాలకు విస్తరించింది. నవ్యాంధ్రప్రదేశ్‌లో నేడు 8 కేంద్రాల నుంచి ప్రచురితమవుతోంది. పత్రికా రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతికను అందుకోవడానికి ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా పోరాటాలకు అక్షరసాయాన్ని అందిస్తూ ప్రత్యామ్నాయ జర్నలిజాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రజల సహకారం, సిబ్బంది నిబద్ధత ఆధారంగా ప్రజాశక్తి పయనం ముున్ముందుకు సాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ నుండి విజయవాడకు తరలి వచ్చిన ప్రజాశక్తి ప్రధాన కార్యాలయం కొన్నాళ్లు అద్దెభవనంలో సాగింది. ఇప్పుడు 2020 నవంబరు 6వ తేదీన రాష్ట్ర రాజధాని కేంద్రం తాడేపల్లిలో నిర్మాణం పూర్తి చేసుకున్న సొంత భవనం నుండి కార్యకలాపాలను సాగిస్తూ అప్రతిహతంగా పురోగమిస్తోంది.



ప్రజాశక్తి అప్రతిహత ప్రస్థానం

ప్రజాశక్తి వారపత్రికగా నడిచింది. వారపత్రిక తేవడానికి అవసరమైనంత మేరకు కంపోజింగ్, ప్రెస్ ఉన్నాయి. దినపత్రికగా తీసుకురావడానికి చాలా సిబ్బంది కావాలి. యంత్రాంగమూ పెరగాలి. మూడు నెలల ముందు సన్నాహాలు మొదలయ్యాయి. సుందరయ్య ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. మోటూరు హనుమంతరావు పత్రికా నిర్వహణ సంబంధమైన ఏర్పాట్లు చూశారు.

ప్రజాశక్తి దినపత్రికగా రాబోతుందన్న వార్త వామపక్ష ప్రగతిశీల వాదులకు ఎంతో ఉత్సాహాన్నిచ్చింది. నాయకుల ద్వారా దాతలు సహాయ సహకారాలు అందజేశారు. పుచ్చలపల్లి సుందరయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎ.ఎం.ఎస్ నంబూద్రిపాద్ పత్రిక తొలి ప్రతిని ఆవిష్కరించారు. ఆ సందర్భంగానే సుందరయ్య... కమ్యూనిస్టులు పత్రికను ఎంత విలువైనవిగా పరిగణిస్తారో వివరించారు. అప్పటివరకూ విశాలాంధ్ర మాత్రమే వామపక్ష దినపత్రికగా వెలువడుతుండేది. కమ్యూనిస్టు పత్రికలంటే అదే నమూనాలో ఊహించేవారు. సాధారణ వార్త ఎంత ముఖ్యమైనదైనా, అంతకంటే పార్టీ సంబంధమైన వార్తకే ప్రథమ ప్రాధాన్యతనివ్వడం, ఉద్యమ సంబంధమైన నాయకుల ప్రకటనలు మొదటిపేజీలో ఇవ్వడం ఇందులో ప్రధానాంశం. అయితే ప్రజాశక్తిని కేవలం వ్యూస్ పేపరుగా కాక న్యూస్ పేపర్‌గా తీసుకురావాలని నాయకత్వం భావించింది. అంటే కేవలం పార్టీ సంబంధిత వార్తలు మాత్రమే కాకుండా, అన్ని రకాలైనవి ఇవ్వాలని నిర్ణయమైంది. ఇదో కొత్త ఒరవడి. అయితే దాన్ని సంపూర్ణం గావించడానికి చాలా కాలం పట్టింది. ప్రజాశక్తి దినపత్రిక పున్ణప్రారంభమైన కొద్ది రోజుల్లోనే కారల్ మార్క్స్ శతజయంతి ఉత్సవాలు వచ్చాయి. అ పైన సిపిఎం జాతీయ మహాసభలు విజయవాడలో అపూర్వంగా జరిగాయి. ఇవన్నీ కూడా పాఠకులకు ఆసక్తికరమైన సందర్భాలు కావడంతో పత్రిక చురుగ్గా నడిచింది. ఆదివారం అనుబంధం విభిన్నంగా ఉందని అభినందనలు వచ్చాయి. పెద్ద యంత్రాంగం లేకున్నా ఉత్సాహవంతులైన యువ పాత్రికేయులే శ్రమపడి రాస్తుండేవారు.

ప్రత్యేకతలు... ప్రతిబంధకాలు

1984లోనే తొలిసారిగా పరిశ్రమల సంచిక, స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచికలు విడుదలయ్యాయి. ఇవన్నీ పత్రిక స్థాయి పెరిగేందుకు దోహదపడ్డాయి. 1984లో ఇందిరాగాంధీ హత్య జరిగినప్పుడు ప్రజాశక్తి ప్రచురించిన పెద్ద ఫొటో హిందూ దినపత్రిక తర్వాత అత్యుత్తమంగా ఉన్నట్లు ప్రశంసించారు. ఇవన్నీ ఉన్నా న్యూస్ ప్రింట్ వ్యయం, జీతభత్యాలు వగైరాలు పెరగడంతో, పత్రిక నిర్వహణ కష్టంగా మారింది. అడ్వర్‌టైజ్‌మెంట్లు చాలని స్థితి. ఆ దశలో యాజమాన్యం ఆరు పేజీల పత్రికను నాలుగు పేజీలకు తగ్గించాలని నిర్ణయించింది. ఇతర పత్రికల పోటీని తట్టుకోవడమే కష్టంగా ఉన్న తరుణంలో ఉన్న పేజీలను తగ్గించడం, పత్రికల్లో వచ్చే ప్రధాన విషయాలేవీ దెబ్బతినకుండా ముందే తగు ప్రణాళిక తయారైంది. ఏమైనా ప్రజాశక్తి రాజకీయ నిబద్ధత, పాఠకాభిమానం దాన్ని నిలబెట్టాయి.

ఈ కాలమంతటా సాంకేతికంగానూ, సిబ్బంది దృష్ట్యాను ప్రజాశక్తి హంగులు సమకూర్చుకుంటూనే వచ్చింది. ఉన్నంతలో అదనపు ఆకర్షణలు, శీర్షికలను జత చేసింది. అన్నిటికన్నా ముఖ్యంగా రాజకీయ నైశిత్యాన్ని నిలబెట్టడంలో విశేష కృషి చేసింది. రాష్ట్రంలోని రాజకీయ సీనియర్ నాయకుల్లో ఒకరుగా, కమ్యూనిస్టు వ్యాఖ్యాతల్లో అగ్రగణ్యుడుగా పేరెన్నికగన్న మోటూరు సంపాదకీయం దానికి పెద్ద పెట్టుబడి కాగా, ఉత్సాహం, అంకితభావం గల సంపాదకవర్గం, యాజమాన్యం, సిబ్బంది దాన్ని ముందుకు నడిపే సైన్యంగా పనిచేశారు. అప్పటికే రంగంలో ఉన్న పత్రికలకు ధీటుగా అది ముందుకు సాగింది.

1984 ఎన్నికల పోరాటంలో ప్రజాశక్తి ఇచ్చిన సమాచారం, ప్రత్యేక ఫీచరింగ్ నినాదాలు వంటివి అందరినీ ఆకర్షించాయి. 1985లో కారంచేడులో దళితులపై హత్యాకాండ జరిగింది. ఆ వార్తను ముందుగా ఇచ్చిన వాటిలో ప్రజాశక్తి ఒకటి. తర్వాత కూడా ఆ వివరాలను ప్రత్యేక ప్రాధాన్యతతో ఇస్తూ వచ్చింది. 1985 మే 25న సుందరయ్య కన్నుమూశారు. పత్రిక మొదటి పేజీలో ఆయన పెద్ద ఫోటోతో రాసిన లీడ్ పాఠకులను కదిలించింది. లౌకిక పార్టీల ఆధ్వర్యంలో సాగిన ఉద్యమాలకు ఎప్పుడూ ప్రజాశక్తి వాణిలా పని చేస్తూ వచ్చింది. దానితో పాటు పలు శీర్షికల ద్వారా రాజకీయ, సైద్ధాంతిక చైతన్యం పంచిపెట్టింది.

1988 డిసెంబర్‌లో వంగవీటి మోహనరంగా హత్యానంతరం అల్లర్లు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. సంయమనంతో, సమతుల్యతతో వ్యవహరించి వాస్తవాలను వెలికితీసి ప్రచురించింది. 1987 తర్వాత రాజీవ్‌గాంధీ బోఫోర్స్ కుంభకోణం దేశాన్ని కుదిపేసింది. ఆ సమాచారాన్ని తేవడంలో ప్రజాశక్తి ప్రముఖ పాత్ర వహించింది. హిందూ దినపత్రిక సహ సంపాదకునిగా ఉన్న ఎన్.రామ్ బోఫోర్స్ కుంభకోణం తాలూకా కీలక పత్రాలను తమ పత్రికలో ప్రచురించడానికి అప్పటి సంపాదకులు అంగీకరించనందున ఇతర పత్రికల ద్వారా విడుదల చేశారు. తెలుగులో ఆయన ప్రజాశక్తిని ఎంచుకున్నారు. బోఫోర్స్ వార్తల ఫీచరింగ్‌తో వచ్చిన ప్రజాశక్తి మార్కెట్లో పెద్ద సంచలనమైంది. ఆ నేపథ్యంలో 1989లో కేంద్రంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం వచ్చింది. రాష్ట్రంలోని తెలుగుదేశం ఓడిపోయి, కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో ప్రజాశక్తి రాజకీయ బాధ్యత పెరిగింది. రాజకీయాంశాలతో పాటు పత్రిక ఆదాయాన్ని పెంచే అడ్వర్‌టైజ్‌మెంట్లు, ఇతర యంత్రాంగాన్ని పెంచుకోవడంపై కేంద్రీకరణ పెరిగింది.

1991లో దశమ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్.రామ్ ప్రజాశక్తి సాంకేతిక పద్ధతులను చూసి ఆనందాశ్చర్యాలు వెలిబుచ్చారు. చేతి కంపోజు నుంచి ఒకేసారి పేజినేషన్‌కు వెళ్లారంటే బూర్జువా దశను దాటి సోషలిస్టు దశలోకి ప్రవేశించారన్న మాట అని చమత్కరించారు. సుందరయ్య రాజకీయాలతో పాటు సాంకేతిక అభివృద్ధి గురించి తనతో తరచూ చర్చించేవారని, ప్రజాశక్తిని చూస్తుంటే ఆయన కలలు నిజమైనట్లు అనిపిస్తోందని రామ్ కరతాళధ్వనుల మధ్య అన్నారు. పదో వార్షికోత్సవానికి సోదర పత్రికల సంపాదకులందరూ హాజరై అభినందించారు.

కొత్త పుంతలు

విద్యుచ్ఛక్తి ఉద్యమంతో మొదలెట్టి ప్రజాశక్తి ప్రజా ఉద్యమాలతో, ప్రపంచీకరణ వ్యతిరేక పోరాటాలతో పూర్తిగా మమేకమైంది. పత్రికలో శీర్షికలు పెరుగుదలే కాక మరింత జనరంజకంగా మారాయి. యంత్రాంగం విస్తరించింది. చిరకాలంగా ఉన్న లోగో సహా అనేక మార్పులు జరిగాయి.

2001లో 20వ వార్షికోత్సవంలో తిరుపతి ఎడిషన్ మొదలైంది. ఇక ఆ తర్వాత చకచకా ఎడిషన్లు పెరిగాయి. ఖమ్మం, కర్నూలు, రాజమండ్రి, కరీంనగర్, శ్రీకాకుళం, ఒంగోలు ఎడిషన్లు వచ్చాయి. ఇంతేకాక వందల సంఖ్యలో కంప్యూటర్ కేంద్రాలు వెలిశాయి. జిల్లా సబ్ సెంటర్లు ఏర్పడ్డాయి. 2004 నుంచి జిల్లాల టాబ్లాయిడ్స్ కూడా మొదలయ్యాయి. సిబ్బంది పెరిగారు. పెరిగిన యంత్రాంగం, విస్తరించిన పునాది, మారిన దృక్పథం ఇవన్నీ కలిసి ప్రజాశక్తిని తెలుగు పత్రికా లోకంలో ఒక విలక్షణ ప్రగతిశీల పత్రికను చేశాయి. ఫలితంగా దాని ప్రతిష్ట, ప్రజాదరణ పెరిగాయి. 1997లో విశాఖ ఎడిషన్ రాష్ట్రంలో మూడో ఎడిషన్‌గా, 2006 నవంబరు 7వ తేదీన శ్రీకాకుళం ఎడిషన్ రాష్ట్రంలో తొమ్మిదో ఎడిషన్‌గా, ఆ తర్వాత ఒంగోలు పది, అనంతపురం 11 ఎడిషన్‌గా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్‌లో ప్రజాశక్తి కొనసాగుతోంది. తెలంగాణలో 2015 మార్చి 21 నుంచి 'నవ తెలంగాణ' పత్రికగా రూపాంతరం చెందింది.

మరిన్ని ఎడిషన్లు

1994లో హైదరాబాదు ఎడిషన్ ప్రారంభమైంది. ఆ ప్రతిపాదనకు మొదట చాలా మంది భయపడ్డారు. కానీ అధునాతన సాంకేతిక సదుపాయాలతో సులభంగానే ఎడిషన్ ప్రారంభమైంది. జయప్రదంగా నడిచింది. ఇది తెలుగులో వామపక్ష పత్రికల చరిత్రలో కొత్త అధ్యాయం. తర్వాత కాలంలో ప్రత్యేక సంచికలు మరింత ఎక్కువగా వచ్చాయి. పత్రిక ఎనిమిది పేజీలైంది. శీర్షికలు పెరిగాయి. కంప్యూటర్ కేంద్రాలు పెరిగాయి. 1999లో పత్రిక కేంద్ర కార్యాలయం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు మారింది.

అనంతలో ప్రజాశక్తి ఎడిషన్ ప్రారంభం

2017 ఆగస్టు 7వ తేదీ అనంతపురం జిల్లాలో ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అంతకు మునుపు కర్నూలు ఎడిషన్ కేంద్రంగా అనంతపురం జిల్లా పేజీలు ముద్రణ అయ్యేవి. జిల్లా పాఠకులకు ప్రజాశక్తిని మరింత చేరువ చేయాలన్న ఉద్ధేశంతో ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే ఎడిషన్ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి సమాచార శాఖ మంత్రి, ఇప్పటి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, అప్పటి ప్రజాశక్తి ఎడిటర్ ఎంవిఎస్.శర్మతో పాటు పలువురు ప్రజాశక్తి అభిమానులు, పాఠకుల సమక్షంలో ఎడిషన్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి జిల్లాలోనే ప్రజాశక్తి పత్రిక ముద్రణ అవుతూ పాఠకులకు ఉదయాన్నే చేరుతోంది.



ప్రజాశక్తి రజతోత్సవ సభలో పాల్గొన్న అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్, ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

మరో మలుపు

1990 ప్రజాశక్తిలో మరో మలుపు. అందులో ఒకటి కంప్యూటర్ల ప్రవేశం. మరొకటి రంగురంగుల ప్రత్యేక సంచికల ప్రారంభం. అప్పటికే పలు దినపత్రికలు కంప్యూటర్లను ప్రవేశ పెట్టాయి. కాస్త ఆలస్యమైనా సమగ్రంగా ప్రజాశక్తి కంప్యూటరీకరణను చేపట్టింది. ఉద్యమ శ్రేయోభిలాషి కొండయ్య అందుకు దోహదపడ్డారు. 1999 మే 19 నుంచి కంప్యూటర్ మీద తేవాలనుకుంది. సిబ్బంది ఉత్సాహం వల్ల మే 1 నుంచే తేగలిగారు. ఇతర పత్రికలు మ్యాటర్ వరకూ కంప్యూటర్‌పై చేసి, లే అవుట్, పేస్టింగ్ చేసేవి. కానీ ప్రజాశక్తి ఒకేసారి పేజీనేషన్ చేయడం విశేషం. కంప్యూటర్ వ్యవస్థను లోతుగా అధ్యయనం చేసిన సిబ్బంది, బాధ్యులు అనేక నూతన ప్రక్రియలను అన్వేషించారు. ఆ విధంగా పత్రిక కొత్త ఆకర్షణ సంతరించుకోవడానికి దోహదపడ్డారు. 1990లో గోదావరి గైడ్ పేరిట పుష్కరాల ప్రత్యేక సంచిక వచ్చింది. ప్రజాశక్తి ప్రత్యేక సంచికలు ప్రతిష్టాత్మకంగా రావడానికి అది నాంది పలికింది.

పుట్టపర్తి నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం

పుట్టపర్తి నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం. యువతకు ఉపాధి కల్పన, రైతులకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీరు అందిస్తాం. మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తాం. అన్ని రంగాల్లోనూ పుట్టపర్తిని అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం' అని పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి తెలిపారు. ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం సందర్భంగా నియోజకవర్గం అభివృద్ధిపై ఆమె పలు విషయాలను తెలియజేశారు.

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



ప్రశ్న: మీ రాజకీయ ప్రస్థానం ఏమిటి.? మొదటి సారే ఎమ్మెల్యేగా గెలవడం ఎలాంటి సంతోషాన్ని ఇస్తోంది..?

ఎమ్మెల్యే : గతంలో మా తాత రాజకీయాల్లో ఉన్నారు. మా నాన్న శంకర్ రెడ్డి కేరళ డిజిపిగా పని చేశారు. కేరళలోనే నా ఉన్నత విద్యాభ్యాసం కొనసాగింది. ఆ తరువాత ప్రముఖ రాజకీయవేత్త, పలు విద్యాసంస్థల అధినేత పల్లె రఘునాథ్ రెడ్డి కుమారునితో వివాహమైంది. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆ విద్యా సంస్థల్లో భాగస్వామ్యం అయ్యాను. 2024 ఎన్నికలలో రాజకీయ సమీకరణలు జరిగి మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న టిడిపి అధిష్టానం నిర్ణయంతో అనుకోకుండా ఎమ్మెల్యే టికెట్ నాకు కేటాయించారు. ఎమ్మెల్యేగా టికెట్ వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. అభ్యర్థిగా నా పేరు ప్రకటించగానే నేను రాజకీయాల్లో రాణించగలనా? అన్న చిన్న సందేహం ఏర్పడింది. మా మామ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రోత్సాహం, సుదీర్ఘకాలంగా ఆయన రాజకీయ అనుభవంతో నా రాజకీయ ప్రస్థానం సులభమైంది. మా మామకు ఎంత గౌరవం ఇస్తున్నారో అదే గౌరవంతో పుట్టపర్తి నియోజకవర్గం ప్రజలు నన్ను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించారు. పుట్టపర్తి ప్రజల రుణం తీర్చుకోలేనిది. వారికి సేవలందించడమే తన ముందున్న లక్ష్యం.

ప్రశ్న: యువతకు ఉపాధి కల్పనపై ఏం చర్యలు తీసుకోన్నారు.?

ఎమ్మెల్యే : ఉమ్మడి అనంతపురం జిల్లా ఉన్నప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెనుకొండలో కియా పరిశ్రమ తెచ్చారు. ఆ పరిశ్రమ రావడంతో జిల్లాలో ఎంతోమందికి ఉపాధి కలుగుతోంది. ఇదే విధంగా పుట్టపర్తి నియోజకవర్గంలో పెద్ద పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి కలుగుతుంది. జిల్లా మంత్రులు, ఉన్నత అధికారులు సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి పరిశ్రమల స్థాపన విషయాన్ని తీసుకెళ్తాం. ముఖ్యమంత్రి సహకారంతో పరిశ్రమలు స్థాపించడానికి కృషి చేస్తాను. ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు ఉన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని నిరుద్యోగ యువతకు అవసరమైన పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తాను.

ప్రశ్న: సాగు, తాగు నీరుపై మీ ఆలోచన ఏమిటి.?

ఎమ్మెల్యే : నియోజకవర్గంలోని 193 చెరువులు నింపడమే ధ్యేయంగా పనిచేస్తాం. గతంలో మా మామ పల్లె రఘునాథ్ రెడ్డి మంత్రిగా ఉన్నప్పుడే సాగునీటి ప్రాజెక్టుకు డిపిఆర్ తయారైంది. ఆ తరువాత 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ నివేదికలు అటకెక్కాయి. అప్పటి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి 193 చెరువులకు నీరు అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, ఆ తరువాత ఆ విషయమే పట్టించుకోలేదు. తీరా 2024 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో 193 చెరువులకు నీరు అందించేందుకు రూ.864 కోట్లు మంజూరు అయ్యాయని దానికి భూమిపూజ చేసి నియోజకవర్గంలో పాదయాత్ర చేసి ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నించారు. అంత పెద్ద మొత్తం మంజూరు అయితే ఆ భూమిపూజకు అప్పటి ముఖ్యమంత్రి, మంత్రులు ఎందుకు హాజరు కాలేదో వారికే తెలియాలి. ప్రస్తుత టిడిపి ప్రభుత్వం నియోజకవర్గానికి తాగునీటిని అందించేందుకు చర్యలూ తీసుకుంటున్నాం.

> ◆ యువతకు ఉపాధి రైతుకు సాగునీరు అందిస్తాం
> ◆ మహిళాభివృద్ధికి చేయూత
> ◆ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

ప్రశ్న: నియోజకవర్గం అభివృద్ధికి ఏమి చర్యలు తీసుకుంటున్నారు.?

ఎమ్మెల్యే : నియోజకవర్గంలో సిసి రోడ్లు లేని గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేస్తాం. తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. ఈ ప్రాంతంలో ఉద్యానవన పంటలకు అనుకూలంగా ఉన్నందున రైతులను ప్రోత్సహించే ఉద్యానవన పంటల సాగుకు కృషి చేస్తాం. రైతులకు డ్రిప్ ఇరిగేషన్ స్ప్రింక్లర్ల పరికరాలు అందించడానికి చర్యలు తీసుకుంటాం. వైద్య సదుపాయాలు గ్రామీణులకు అందే విధంగా అవసరమైన చోట్ల ఆరోగ్య సబ్ సెంటర్‌లను నిర్మిస్తాం. పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.

ప్రశ్న:పుట్టపర్తి అభివృద్ధికి ఏం చర్యలు తీసుకోనున్నారు.?లి

ఎమ్మెల్యే : శ్రీ సత్య సాయి బాబా నడయాడిన పుట్టపర్తిలో నేను గెలుపొందడం అదృష్టంగా భావిస్తాను. పుట్టపర్తిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటాం. గతంలో వైసిపి ప్రభుత్వం ఏమాత్రం అభివృద్ధి చేయలేదు. పట్టణంలోని మురుగు నీరు చిత్రావతిలో కలుస్తున్నా, పర్యాటకులు భక్తులు మురుగునీటితో అసహ్యించుకుంటున్నా వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇటీవలే రూ.13 లక్షలతో మురుగునీరు చిత్రావతి నదిలో చేరకుండా పనులు చేపట్టాం. భూగర్భ డ్రెయినేజీ ఏర్పాటు చేసి ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని కమిషనర్‌ను ఆదేశించాం. చిత్రావతి నది పరివాహక ప్రాంతం సుందరీకరణకు కృషి చేస్తాను. మున్సిపాల్టీకి నూతన భవనాన్ని నిర్మిస్తాం. పట్టణం పరిధిలోని అన్ని రహదారులనూ మరమ్మతులు చేయిస్తాం. ప్రభుత్వపరంగా ఏం చేయాలో అవన్నీ పరిశీలించి పట్టపర్తి పట్టణాన్ని అభివృద్ధి చేస్తాం.

ప్రశ్న: మహిళల అభివద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు..?

ఎమ్మెల్యే : డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేస్తాం. డ్వాక్రా గ్రూపులను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుంది. ఆయా గ్రూపుల్లోని సభ్యులు ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధి పొందే విధంగా చేస్తాం. తద్వారా అబివృద్ధి సాధించే లక్ష్యంగా పనిచేస్తాం. మహిళల కోసం ప్రత్యేకంగా టెక్స్ టైల్ ద్వారా ఉపాధి కల్పనకు కృషి చేస్తాం. ప్రభుత్వం మహిళల కోసం ప్రకటించిన పథకాలన్నీ పారదర్శకంగా అమలయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం. పుట్టపర్తిలో త్వరలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తాం.

ప్రశ్న:ప్రజలకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

ఎమ్మెల్యే : తనను ఆదరించి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనుల్లో అందరూ సహకరించాలని కోరుతున్నాను. ప్రభుత్వం నుంచి మంజూరు అయ్యే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. పార్టీలో అందరిని కలుపుకుంటూ అభివృద్ధి సాధనకు కృషి చేస్తాం. ప్రజాసేవలో తాము ఎప్పుడూ ముందు ఉంటామని, సమస్య ఏదైనా శక్తి వంచన లేకుండా వాటి పరిష్కారానికి కృషి చేస్తాను.

శ్రీ సత్య సాయి జిల్లాకు రెండున్నరేళ్లు..!

> ◆ ఇప్పటికీ సొంత ప్రభుత్వ భవనాల ఏర్పాటు లేదు
> ◆ ఎక్కువ భాగం కార్యాలయాలన్నీ సత్యసాయి ట్రస్టువే
> ◆ మౌలిక సదుపాయాలు లేక అధికారులకు ఇబ్బందులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనలో భాగంగా 2022 ఏప్రిల్ 4న నూతనంగా పుట్టపర్తి కేంద్రంగా సత్యసాయి జిల్లా ఏర్పడింది. ఈ కొత్త జిల్లా ఏర్పడి ఇప్పటికి రెండున్నరేళ్లు పూర్తయ్యింది. అప్పటి వైసిపి ప్రభుత్వం గతంలో రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాలను విభజించి మరో పదమూడు నూతన జిల్లాలను ఏర్పాటు చేసింది. గతంలో శ్రీ సత్యసాయి సోదరుడు ఆర్‌వి.జానకిరామయ్య బతికున్నప్పుడే పుట్టపర్తి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని చాలా కృషి చేశాడు. పలుసార్లు రాష్ట్ర ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. అప్పట్లో జిల్లాల విభజన జరగలేదు. వైసిపి ప్రభుత్వం జిల్లాల విభజన నిర్ణయం తీసుకోవడంతో పుట్టపర్తి కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు మార్గం సుగుమమం అయ్యింది. జిల్లా ఏర్పాటు సమయంలో హిందూపురం కావాలని, పెనుకొండ కావాలంటూ ఆ ప్రాంతాల్లో డిమాండ్లను తెరపైకి తెచ్చారు. సంతకాల సేకరణతో పాటు నాయకుల దష్టికి తెచ్చారు. అదే సమయంలో పుట్టపర్తిలో యువత కూడా సంతకాల సేకరణ, ర్యాలీలు, తదితర ఆందోళనలు చేశారు. అప్పటి వైసిపి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి అప్పటి 6 నియోజకవర్గాల ఎమ్మెల్యేల మెజార్టీ సభ్యుల సంతకాలు సేకరించి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అందరి సమిష్టి కృషితో పుట్టపర్తి జిల్లా కేంద్రంగా రూపాంతరం చెందింది.



పుట్టపర్తిలో కలెక్టరేట్ భవనం


దీన జనోద్ధరణ భవన సదుపాయాలు

పుట్టపర్తి కేంద్రంగా సత్యసాయి జిల్లా ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. అయితే జిల్లాకు కావాల్సిన మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఉన్న విద్యాగిరిలో ఒక పెద్ద భవనం అప్పగించగా అందులో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ కార్యాలయాలతో పాటు మరికొన్ని కార్యాలయాలు నెలకొల్పారు. సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ట్రస్టు భవనాలను సైతం జిల్లా కార్యాలయాలకు అప్పగించారు. మరో 16 శాఖల కార్యాలయాలకు కమ్మవారిపల్లి సమీపంలో గల సత్యసాయి దీన జనోద్ధరణ భవన సముదాయాన్ని కూడా ప్రభుత్వ కార్యాలయాలకు అప్పగించారు. కలెక్టరేట్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఎదురుగా గల భవన సముదాయాలు కొంతవరకు బాగానే ఉన్నాయి. దీన జనోద్ధరణ భవన సముదాయాల్లో వసతుల్లేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి దూరంగా ఉండడం కూడా మరో సమస్యగా మారింది. ఇక్కడ ఉన్న చాలా కార్యాలయాల్లో అధికారులు హాజరు సంతకం పెట్టి వెళ్లిపోతున్నట్లు తెలుస్తోంది. ఎవరైనా అడిగితే అక్కడి సిబ్బంది ఇప్పుడే కలెక్టరేట్‌కు వెళ్లారనే సమాధానం విన్పిస్తోంది. జిల్లా స్థాయి అధికారులు అక్కడ ఎప్పుడు ఉంటారో తెలియని పరిస్థితి ఉంది. ఇక జిల్లా పోలీస్ కార్యాలయం గతంలో ఉన్న పర్తి ధర్మశాలలో ఏర్పాటు చేశారు. ఆ భవన సదుపాయాలు అద్దెవి అయినా జిల్లా పోలీస్ కార్యాలయం పరవాలేదనిపిస్తోంది. ఇప్పటికీ కొన్ని శాఖలు పుట్టపర్తి జిల్లా కేంద్రానికి రాలేదు. వారంతా అనంతపురం కేంద్రంగానే పనిచేస్తున్నారు. కార్మిక శాఖ, మైనార్టీ కార్పొరేషన్, ఉపాధి కల్పన కార్యాలయం, మత్స్య శాఖ కార్యాలయం, జిల్లా విద్యుత్ కార్యాలయం, ఎస్సీ, ఎస్టీ, కార్యాలయం తదితర శాఖలు ఇంకా అనంతపురం కేంద్రంగానే కొనసాగుతున్నాయి. కలెక్టరేట్లో సమావేశాలు ఉన్నప్పుడు మాత్రమే ఆ శాఖల అధికారులు కలెక్టరేట్‌కు వస్తుంటారు.

ఇటీవల హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురంను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ ప్రకటనతో పుట్టపర్తి ప్రాంత ప్రజల్లో ఒకింత అసహనం వ్యక్తం అవుతోంది. ఇటు అధికారులు అటు ప్రజలు ఆందోళనలో పడ్డారు. వచ్చిన జిల్లా కేంద్రాన్ని పోగొట్టుకోలేమని అవసరమైతే ఆందోళనకు సిద్ధమని పుట్టపర్తి ప్రాంత ప్రజలు చెబుతున్నారు. ఏది ఏమైనా కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం నూతన సత్యసాయి జిల్లాకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



డా॥బొగ్గు సురేష్

అంధత్వ రహిత సమాజం కోసం

'పీస్ వెల్ఫేర్ సొసైటీ' కృషి

డాక్టర్ బొగ్గు సురేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అంధత్వ రహిత సమాజ స్థాపన కోసం పీస్ వెల్ఫేర్ సొసైటీ కృషి చేస్తోందని అల్ట్రా విజన్ ఐ హాస్పిటల్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొగ్గు సురేష్ తెలిపారు. పుట్టపర్తి ఇన్సిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లాలోని పలు గ్రామాల్లో అంధత్వ నివారణ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. పుట్టపర్తి ఇన్సిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమే కాక, వేలాది మందికి కంటి పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, కంటి జబ్బులను గుర్తించిన వారికి పుట్టపర్తి లోని సత్యమ్మ గుడి వద్ద ఉన్న అల్ట్రా విజన్ ఐ ఆసుపత్రి ద్వారా శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో కోటి మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, లక్ష మందికి కంటి ఆపరేషన్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించడం కూడా పీస్ వెల్ఫేర్ సొసైటీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పేద విద్యార్థులకు ఉచిత మెడికల్ కోర్సులు, అందిస్తున్నామని చెప్పారు. పుట్టపర్తి మెడికల్ ఇన్సిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ డాక్టర్ బొగ్గు సురేష్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. 40 శాతం ఫీజు రాయితీతో ఇంటర్ పాసైన పేద విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. 2024 బ్యాచ్‌కు సంబంధించి అడ్మిషన్లు పూర్తి అయ్యాయన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయనుందని తెలిపారు. రెండు సంవత్సరాల కోర్సుకు సంబంధించి ఆఫ్తాలమిక్, టెక్నీషియన్, డిఎంఎల్‌టి పారామెడికల్, కోర్సులను అందుబాటులో ఉంచామ న్నారు. దూర ప్రాంత విద్యార్థుల కోసం కాలేజ్ మేనేజ్మెంట్, హాస్టల్ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పుట్టపర్తిలోని సత్యమ్మ గుడి దగ్గర గల అల్ట్రా విజన్ ఐ హాస్పిటల్ లో సంప్రదించాలని కోరారు.

పుట్టపర్తికి ప్రత్యేక గుర్తింపు

పుట్టపర్తి... బహుశా ఏ పేరు తెలియని వారు ఉండరేమో. ఎందుకంటే ఈ పట్టణానికి ప్రపంచ స్థాయి గుర్తింపు ఉంది. మీరు 'ఏ ప్రాంతం వారు'.? అంటే మాది పుట్టపర్తి అని చెప్పగానే ఎదుటి వారికి గుర్తుకు వచ్చే ప్రాంతం. అంతలా పుట్టపర్తికి ఖ్యాతి లభించింది. సత్యసాయిబాబా రాకతో పుట్టపర్తి రూపమే మారిపోయిందని చెప్పాలి. ప్రపంచ దృష్టి సత్యసాయిబాబా మీద పడడంతో పుట్టపర్తి అనతికాలంలో పర్యటక కేంద్రంగా మారింది. సత్యసాయిట్రస్టు, ప్రభుత్వాలు సంయుక్తంగా పుట్టపర్తి అభివృద్ధిపై దృష్టి సారించడంతో అంచెలంచెలుగా దీని రూపం మారుతూ వచ్చింది. కుగ్రామంగా ప్రారంభం అయిన దీని చరిత్ర ప్రస్తుతం జిల్లా కేంద్రం స్థాయికి ఎదిగింది. గ్రామం, పంచాయతీగా... పంచాయతీ, మండల కేంద్రంగా... మండల కేంద్రం, నియోజకవర్గ కేంద్రంగా... నియోజకవర్గ కేంద్రం, మున్సిపాల్టీగా... మున్సిపాల్టీ జిల్లా కేంద్రంగా రూపాంతరం చెందింది. నాలుగు దశాబ్దాల కాలంలో ఎన్నో మార్పులు.. ఎన్నెన్నో కొత్త రూపాలను సంతరించుకుంది. ప్రస్తుతం పుట్టపర్తిని శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంగా మార్చడంతో మరింత గుర్తింపు లభించింది. జిల్లా కేంద్రం ఏర్పాటుపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-
పుట్టపర్తి అర్బన్

జిల్లా కేంద్రం ఏర్పాటుతో మరింత ఖ్యాతి


పుట్టపర్తి పట్టణం

అనంతపురం జిల్లాలోని ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లో పుట్టపర్తి ఉండేది. 2009 వరకు కేవలం పుట్టపర్తి మండల కేంద్రంగానే ఉండేది. పుట్టపర్తికి తొలుత గొల్ల పాళ్యం... ఆ తరువాత వాల్మీకిపురం అనే పేరు ఉండేదని అక్కడి స్థానికులు చెబుతుంటారు. సత్యసాయిబాబా వచ్చిన తరువాత పుట్టపర్తిగా రూపాంతరం చెంది ప్రపంచదేశాలను ఆకర్షించేలా తయారైంది. కనీసం బస్టాండు కూడా లేని ఆ ప్రాంతంలో ఏకంగా ఎయిర్‌పోర్టు వచ్చింది. రోడ్డు మార్గం కూడా లేని ఊరికి రైళ్లు వచ్చాయి. హిందూపురం పార్లమెంట్ పరిధిలో అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో పుట్టపర్తి ప్రధాన మైనదని ప్రభుత్వం గుర్తించింది. అందుకే జిల్లాల పునర్విభజనలో పుట్టపర్తికి ప్రాధాన్యతను ఇస్తూ ప్రభుత్వం దీనిని జిల్లా కేంద్రంగా గుర్తించింది. అంతర్జాతీయ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న పుట్టపర్తిని శ్రీ సత్యసాయి జిల్లాగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా 2022 ఏప్రిల్ 4వ తేదీ నుంచి సత్యసాయి జిల్లా పాలన ప్రారంభం అయ్యింది. సత్యసాయి జిల్లా పరిధిలోకి పుట్టపర్తి, కదిరి, హిందూపురం, మడకశిర, పెనుకొండ, ధర్మవరం నియోజకవర్గాలతో పాటు, రాప్తాడు నియోజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, రామగిరి మండలాలు ఉన్నాయి. సత్యసాయి జిల్లా విస్తీర్ణం 9వేలకు పైగా చదరపు కిలోమీటర్లుగా ఉండనుంది. సత్యసాయి బాబా ఉన్న ప్రాంతం కావడంతో పాటు పర్యాటక కేంద్రం, విద్య, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండడంతో ప్రభుత్వం పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా ప్రకటించింది.

ఎయిర్‌పోర్టు... రైల్వే స్టేషన్..

50 ఏళ్ల క్రితం పుట్టపర్తికి బస్సులు కూడా వెళ్లని పరిస్థితి ఉండేది. అలాంటిది 1990 నాటికి ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్లు అందుబాటులోకి వచ్చాయి. ఎయిర్‌పోర్టు నుంచి ఇతర దేశాలతోపాటు, దేశంలోని అన్ని ప్రాంతాలకు విమానాలు తిరుగుతుంటాయి. సత్యసాయి మరణం తరువాత విమానాశ్రయం వినియోగం తగ్గింది. అయితే భవిష్యత్తులో ఇది పూర్తి స్థాయి విమానాశ్రయంగా మారుతుందని అక్కడి వారు చెబుతున్నారు. విమానాశ్రయం పుట్టపర్తి పట్టణానికి 4 కి.మీ దూరంలో ఉంది. దాదాపు 450 ఎకరాల విస్తీర్ణం, 2,230 మీ॥ రన్‌వే ఉంది.

ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్..

పుట్టపర్తిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రైల్వే స్టేషన్‌ను నిర్మించారు. శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం పేరిట 2000 నవంబర్ 23వ తేదీన దీనిని ప్రారంభించారు. ఇక్కడి నుంచి బెంగుళూరు, హైదరాబాదు, విశాఖపట్టణం, భువనేశ్వర్, ముంబయి, ఢిల్లీ తదితర దేశంలోని అన్ని ప్రముఖ నగరాలకు ఇక్కడి నుంచి రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక పుట్టపర్తి ఆర్టీసీ డిపో నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయి.

పుట్టపర్తిలో పలు సాగునీటి వనరులు

శ్రీ సత్యసాయి జిల్లాలో పలు సాగునీటి వనరులూ ఉన్నాయి. ముదిగుబ్బ మండలంలో యోగివేమన రిజర్వాయర్, పుట్టపర్తిలో చిత్రావతి, పెడబల్లి రిజర్వాయర్లు, హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలో పెనుకొండ వద్ద గొల్లపల్లి, బుక్కపట్నం మండలంలో మారాల, కదిరి ప్రాంతంలో చెర్లోపల్లి రిజర్వాయర్లు ఉన్నాయి. వీటితో పాటు అతిపెద్ద చెరువులు అయిన బుక్కపట్నం, ధర్మవరం చెరువులు ఈ జిల్లాలోకే వస్తాయి.

◆ అంచలంచెలుగా ఎదిగిన పుట్టపర్తి

◆ పంచాయతీ.. మండలం, నియోజకవర్గం కేంద్రం... మున్సిపాల్టీ.. జిల్లా కేంద్రం...

◆ ఐదు దశాబ్దాల్లో ఎన్నో మార్పులు

పుట్టపర్తికి రాజకీయ గుర్తింపు

పర్యాటక, అధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు తెచ్చుకున్న పుట్టపర్తి, రాజకీయంగానూ అంతే ప్రాముఖ్యతను సంతరించుకుంది. 2009కి పూర్వం వరకు కేవలం మండల కేంద్రంగానే ఉన్న పుట్టపర్తి ఆ తరువాత పుట్టపర్తి నియోజకవర్గ కేంద్రంగా రూపాంతరం చెందింది. నల్లమాడ స్థానంలో పుట్టపర్తిని నియోజకవర్గ కేంద్రంగా మార్చారు. ఇప్పటి వరకు ఈ నియోజక వర్గానికి నాలుగు సార్లు ఎన్నికలు జరిగాయి. జిల్లాలో ఎక్కువ మండలాలతో అతి పెద్ద నియోజకవర్గంగా పుట్టపర్తికి గుర్తింపు ఉంది. ఈ ప్రాంతం నుంచి పలువురు ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రులుగా పని చేశారు. అగిశం వీరప్ప నుంచి పల్లె రఘునాథరెడ్డి వరకు పలువురు క్యాబినెట్ మంత్రులుగా పని చేశారు. నూతనంగా ఏర్పడిన పుట్టపర్తి నియోజకవర్గంలో 2009, 2014, 2019, 2024లో మూడు సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా ఇందులో రెండు సార్లు పల్లె రఘునాథరెడ్డి, ఒకసారి దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఒక సారి పల్లె సింధూరరెడ్డి ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ప్రస్తుతం పల్లె సింధూర రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు.


పుట్టపర్తి ఎయిర్‌పోర్టు



పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్..


పుట్టపర్తిలోని సత్యసాయి విశ్వవిద్యాలయం

కూటమి ప్రభుత్వంలోనే

ముస్లిం, మైనార్టీల అభివృద్ధి


లోకేష్ కు వినతిపత్రం ఇస్తున్న మహమ్మద్ రఫీ

మహమ్మద్ రఫీ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ముస్లిం, మైనార్టీల అభివృద్ధి టిడిపి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టిడిపి మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎస్.మహమ్మద్ రఫీ తెలియజేశారు. ఇటీవల ముస్లిం మైనార్టీల సమస్యలపై రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, ఫారుక్‌లను కలిసి వినతి పత్రాలు అందించినట్లు ఆయన తెలియజేశారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు రంజాన్ తోఫా, దుల్హన్, హజ్ యాత్రికులకు తగిన సహకారం, మసీదుల మరమ్మతులు దుకాణ్ మఖాన్ తదితర పథకాలకు నిధులు మంజూరు చేసేవారన్నారు. వైసిపి ప్రభుత్వం ఈ పథకాలన్నీ రద్దు చేసిందన్నారు. పవిత్రమైన రంజాన్‌కు తోఫా కింద సరుకులు అందించడం ద్వారా పేదలు ఎంతో సంతోషంగా పండుగ చేసుకునే వారన్నారు. ఇప్పుడు తిరిగి టిడిపి అధికారంలోకి రావడంతో ఆ పథకాలన్నీ మళ్లీ పునరుద్ధరణ కానున్నాయని చెప్పారు. ఇటీవల మంత్రులు ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫారుక్‌లను కలిసి మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వారికి వినతిపత్రం అందించాను. మైనార్టీలు పలు ప్రాంతాల్లో శ్మశాన వాటికలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపామన్నారు. పుట్టపర్తిలో ముస్లిం మైనార్టీల కోసం టిడిపి హయాంలో షాదీమహల్ నిర్మాణానికి రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులతో భవన నిర్మాణం పూర్తి అయ్యిందని చెప్పారు. ప్రహరీ, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా తదితర పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఐదేళ్ళుగా ఒక్క రూపాయి కూడా షాదీమహల్ అభివృద్ధికి మంజూరు చేయలేదన్నారు. మరో రూ.50 లక్షలు మంజూరు చేస్తే అక్కడ పనులన్నీ పూర్తవుతాయని చెప్పారు. ఇదే విషయాన్ని ప్రస్తుతం మంత్రుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిధుల మంజూరుపై వారు సానుకూలంగా స్పందించారన్నారు. గత ఎన్నికల్లో కూడా అధిక శాతం ముస్లింలు టిడిపి వెంటే ఉన్నారన్నారు. పేద ముస్లిం మైనార్టీల కోసం విరివిగా రుణాలు మంజూరు చేయాలని మంత్రులను కోరామన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పుట్టపర్తిలో టిడిపి గెలుపుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేశానని చెప్పారు. తనకు ప్రభుత్వ పరంగా ఏదైనా నామినేట్ పోస్టు ఇవ్వాలని మంత్రులను కోరినట్లు తెలిపారు. అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్న తాను కట్టుబడి ఉంటానని తెలిపారు.



2017 ఆగస్టు 7వ తేదీ ప్రజాశక్తి ఎడిషన్ మొదటి పత్రికను విడుదల చేస్తున్న అప్పటి అప్పటి మంత్రి ఇప్పటి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కవులు, ప్రజాశక్తి సిబ్బంది(ఫైల్‌ఫోటో)

అనంతలో ప్రజాశక్తి ఎడిషన్

ప్రజాశక్తి దినపత్రిక అభివృద్ధి క్రమంలో భాగంగా 2017 ఆగస్టు 7వ తేదీ అనంతపురం జిల్లాలో ఎడిషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అంతకు మునుపు కర్నూలు ఎడిషన్ కేంద్రంగా అనంతపురం జిల్లా పేజీలు ముద్రణ అయ్యేవి. జిల్లా పాఠకులకు ప్రజాశక్తిని మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే ఎడిషన్ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి సమాచార శాఖ మంత్రి, ఇప్పటి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, సాహితీవేత్తలు, అభిమానులు, పాఠకుల సమక్షంలో ఎడిషన్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి జిల్లాలోనే ప్రజాశక్తి పత్రిక ముద్రణ అవుతూ పాఠకులకు ఉదయాన్నే చేరుతోంది. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ఒక్క రోజు కూడా పత్రిక ముద్రణను ఆపకుండా పాఠకులకు చేరవేసింది.

సత్యసాయి జిల్లాగా కొత్త శకం

అటు పర్యాటక కేంద్రం.. ఇటు జిల్లా కేంద్రంగా గుర్తింపు

పర్యాటక కేంద్రంగా ఉన్న పుట్టపర్తి జిల్లా కేంద్రంగా రూపాంతరం చెందింది. ప్రపంచ గుర్తింపు పొందిన పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా మార్చి మరింత గుర్తింపును తీసుకొచ్చారు. గత వైసిపి ప్రభుత్వం జిల్లాల పునర్ విభజనలో భాగంగా సత్యసాయి జిల్లా కేంద్రం పేరుతో పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా మార్చారు. దీంతో 2022 ఏప్రిల్ 4వ తేదీ నుంచి పుట్టపర్తి కేంద్రంగా జిల్లా పరిపాలన సాగుతోంది. అధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా ఉన్న పుట్టపర్తి జిల్లా కేంద్రంగా మారి కొత్త శకాన్ని ప్రారంభించింది.


పుట్టపర్తిలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి కేంద్రంగా సత్యసాయి జిల్లా ఆవిష్కృతమైంది. గత వైసిపి ప్రభుత్వం 2022 ఏప్రిల్ ఈనెల 4వ తేదీన ఉగాది పండుగ రోజున కొత్త జిల్లాకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లా కేంద్రం విషయంలో ఎటువంటి మార్పులు చేయకుండా రెవెన్యూ డివిజన్లలో స్వల్ప మార్పులతో ఈ నోటిపికేషన్ వెలువడింది. జిల్లా కేంద్రం ఏర్పాటు విషయంలో పెనుకొండ, హిందూపురం ప్రాంతంలో ఆ ప్రాంత ప్రజల నుంచి డిమాండ్లు విన్పించాయి. అయితే అప్పటి వైసిపి ప్రభుత్వం పుట్టపర్తి వైపే మొగ్గు చూపింది. రెవెన్యూ డివిజన్లలో మాత్రం ముందు నుంచే మార్పులు చేర్పులు చేస్తూనే వచ్చింది. మొదట ఇచ్చిన నోటిఫికేష్ కదిరి రెవెన్యూ డివిజన్ లేకుండా ధర్మవరం, పుట్టపర్తి, పెనుకొండ రెవెన్యూ డివిజన్లతో ఇచ్చారు. కదిరి నుంచి వ్యతిరేకత రావడంతో ధర్మవరం ఎత్తేసి కదిరి, పుట్టపర్తి, పెనుకొండ రెవెన్యూ డివిజన్లతో ఒక నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే అభ్యంతరాల్లో అత్యధికంగా రెవెన్యూ డివిజన్ ధర్మవరం ఉంచాలన్న విజ్ఞప్తులు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తుది నోటపికేషన్ ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, పెనుకొండ నాలుగు రెవెన్యూ డివిజన్లతో కొత్త జిల్లా ఏర్పాటు చేసింది. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 32 మండలాలు ఉన్నాయి. 8,925.65 చదరపు కిలోమీటర్ల వైశ్యాలంతో పుట్టపర్తి జిల్లా ఏర్పాటవనుంది. 17.22పైగా లక్షల జనాభా దీని పరిధిలో ఉండనుంది. ఉమ్మడి జిల్లా పరంగా తీసుకుంటే అనంతపురం జిల్లా పరిధిలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, సత్యసాయి జిల్లా పరిధిలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటాయి. శ్రీ సత్యసాయి జిల్లాలోకి పుట్టపర్తి, కదిరి, హిందూపురం, మడకశిర, పెనుకొండ, ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి.

సానుకూలతలు

అనంతపురం జిల్లా నుంచి విడిపోయి నూతంగా ఏర్పడిన సత్యసాయి జిల్లాకు కొన్ని సానుకూలతలు ,కొన్ని ప్రతికూలతలు ఉండనున్నాయి. సానుకూలతల్లో చూసినప్పుడు సత్యసాయి జిల్లానున్న ప్రాంతం ఇప్పుడిప్పుడు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంగానుంది. హిందూపురం ముందు నుంచి పారిశ్రామిక ప్రాంతంగానున్న విషయం తెలిసిందే. గడిచిన ఐదారేళ్లలో పెనుకొండ ప్రాంతంలో కియా కార్ల పరిశ్రమ వచ్చింది. దానికి అనుబంధంగా అనేక చిన్న పరిశ్రమలూ ఉన్నాయి. దీంతో ఇతర పరిశ్రమలు కూడా ఇటువైపు చూస్తున్నాయి. నాసిన్, బెల్ పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. కర్నాటకకు సరిహద్దు కావడంతో ఐటి పరిశ్రమలు కూడా ఇటువైపు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో పారిశ్రామికంగా శ్రీసత్యసాయి జిల్లా అభివృద్ధి చెందేందుకు అనుకూలతలున్నాయి..

పారిశ్రామిక ప్రగతికి ఊతం

సత్యసాయి జిల్లా ఏర్పాటుతో పారిశ్రామిక ప్రగతికి కూడా ఊతం ఇచ్చినట్లు అయ్యింది. విశ్వనాగరిక నగరం బెంగళూరుకు కేవలం 154 కిలోమీటర్ల దూరంలోనే పుట్టపర్తి ఉంది. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి అయితే 131 కిలోమీటర్ల దూరమే. ఇప్పటికే పుట్టపర్తిలో విమానాశ్రయం ఉంది. దీనివల్ల పారిశ్రామిక, పాలనాపరమైన కార్యకలాపాలు సులువుగా నిర్వహించుకోవచ్చు. పెనుకొండ సమీపంలోని కియా కార్ల కంపెనీ, కొడికొండ వద్ద ఏర్పాటైన లేపాక్షి నాలెడ్జ్ హబ్ ప్రాంతాలు కూడా పుట్టపర్తికి దగ్గరగానే ఉంటాయి. దీంతో కొడికొండ చెక్‌పోస్టు నుంచి కియా కంపెనీ వరకు పరిశ్రమలు వృద్ధి చెందడానికి, మిగిలిన ప్రాంతాల్లోనూ పరిశ్రమల స్థాపనకు సత్యసాయి జిల్లా దోహదం కానుంది.

సేద్యపు సిరులు..చారిత్రక వైభవాలు

సత్యసాయి జిల్లా పరిధిలో ఆయకట్టున్న చెరువులు సింహభాగం వస్తున్నాయి. బుక్కపట్నం చెరువు 2,971 ఎకరాలు, పరిగి చెరువు 2,851 ఎకరాలు, ధర్మవరం చెరువు 1,922 ఎకరాలు, కొట్నూరు చెరువు 1,508 ఎకరాలు, హిందూపురం చెరువు 1,130 ఎకరాలు, గొట్లూరు చెరువు 642 ఎకరాల ఆయకట్టు కలిగి ఉన్నాయి. యోగివేమన, చిత్రావతి, పెడబల్లి రిజర్వాయర్లు, హంద్రీ నీవా ప్రాజెక్టు పరిధిలోని గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి రిజర్వాయర్లు ఈ జిల్లా పరిధిలోకి వస్తున్నాయి. వీటితో పాటు చారిత్రక ప్రాంతాలైన పెనుకొండ, లేపాక్షి, హేమావతి, ఖాద్రీ లక్ష్మీనృసింహుని క్షేత్రం, తిమ్మమ్మమర్రిమాను వంటివి ఈ జిల్లాలో ఉంటాయి.


ప్రతికూలతలు

ఈ ప్రాంతానికి ప్రధానం అవరోధం సాగునీరు లేకపోవడం, నికరంగా సాగునీటిని అందించే ఒక్క ప్రాజెక్టూ ఈ ప్రాంతంలో లేదు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఉన్నా అత్యధికం ఉత్తర ప్రాంతానికే పరిమితమైంది. హంద్రీనీవా వచ్చినా ప్రధానమైన జలాశయాలు ఇక్కడే ఉన్నాయి. ఇక్కడికి కొంత వరకు దిగువకు వచ్చేందుకు వీలుంది. అయితే అక్కడ ప్రాజెక్టులు ఏవీ పెద్దవి లేవు. కదిరి, పుట్టపర్తి, మడకశిర వంటి అత్యంత వెనుకబడిన ప్రాంతాలున్నాయి. వర్షాధారంపైనే పంటలు అత్యధికంగా సాగవుతున్నాయి. వర్షాలతో పంటల్లేక వలసలు వెలుతున్న ప్రాంతాలు కూడా ఇవే అధికంగా ఉంటాయి. ఇవి ప్రధానంగా ప్రతికూలంశాల అంశాలుగా కన్పిస్తున్నాయి. అయితే జిల్లా ఏర్పాటు అయినప్పటి నుంచి పాలకులు, అధికారులు ఒక్కో సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నారు.



పుట్టపర్తి గణేష్ సర్కిల్


6 వర్ధంతి
క్రమ శిక్షణే ఊపిరిగా, కష్టమే ఇష్టంగా,
నిరాడంబరతే ఆలంబనగా
చెరగని చిరునవ్వుతో
అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ...
అందరి హృదయాలలో మంచిపేరు
సంపాదించుకున్న మీరు మా నుండి
భౌతికంగా దూరమై నేటికి
6 సంవత్సరాలు గడిచిననూ మా మదిలో
మెదులుతూనే ఉంటారు..
కీ॥శే॥ పల్లె ఉమా గారు
ఓ. గోపాల్ రెడ్డి.
మండల కన్వీనర్
అమడగూరు.
పిచ్చిలి దినేష్ రెడ్డి.
టీడీపీ నాయకుడు,
మహమ్మాదాబాద్.
శ్రీనివాసులు
బూత్ కన్వీనర్,
మహమ్మాదాబాద్.



ప్రజాశక్తికి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...
జిల్లా కలెక్టర్, టి.ఎస్.చైతన్ గారికి, పుట్టపర్తి ఎమ్మెల్యే
పల్లె సిందూరరెడ్డి గారికి, మండలంలోని వివిధశాఖ అధికారులకు,
మిత్రులకు,బంధువులకు, శ్రేయోభిలాషులకు,
ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం, పుట్టపర్తి నియోజకవర్గం
సమగ్రాభివృద్ధి ప్రత్యేక సంచిక సందర్భంగా శుభాకాంక్షలు...
ఓబులేసు
మండల ఆర్.డబ్ల్యూ.ఎస్.
జె.ఇ, కొత్తచెరువు,
శ్రీసత్యసాయి జిల్లా
సెల్ : 9441191503


ప్రజాశక్తికి 44వ
వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రజాశక్తి దినపత్రిక దినదినాభివృద్ధి చెందుతూ..
నిత్యం ప్రజల పక్షాన నిలుస్తూ..నేడు 44వ వార్షికోత్సవం
జరుపుకుంటున్న శుభవేళ "ప్రజాశక్తి" యాజమాన్యానికి,
సిబ్బందికి శుభాకాంక్షలు తెలుపుతూ..
డి. ఉమాపతి యాదవ్,
బీసీ సెల్ కార్యదర్శి, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షులు, పుట్టపర్తి.


ప్రజాశక్తి
44వ వార్షికోత్సవం శుభాకాంక్షలు
ప్రజల పక్షాన పోరాటం చేస్తూ..
సమస్యల పరిష్కారానికి మార్గదర్శిగా
ఉన్న "ప్రజాశక్తి" దినపత్రికకు
44వ వార్షికోత్సవం జరుపుకుంటు
సందర్భంగా ప్రజాశక్తి యాజమాన్యానికి,
సిబ్బందికి శుభాకాంక్షలు తెలుపుతూ..
బోయపల్లి శివారెడ్డి, బోయపల్లి మధుబాల
బోయపల్లి ఓ.డి.చెరువు మండలం


ప్రజాశక్తి దినపత్రికకు
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
దినదినాభివృద్ధి
చెందుతున్న
ప్రజాశక్తి
పాఠకులకు
అధికారులకు
సిబ్బందికి
అభిమానులకు
హృదయపూర్వక
శుభాకాంక్షలు
రత్నప్ప చౌదరి
పుట్టపర్తి మున్సిపల్ ఫోర్ లీడర్
మామిళ్ళకుంట క్రాస్, పుట్టపర్తి.


ప్రజాశక్తికి 44వ
వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతీ అక్షరం ప్రజల పక్షాన నిలుస్తూ..నిరంతరం నిజాలను
నిర్భయంగా వెలికి తీస్తూ..దినదినాభివృద్ధి చెందుతూ..
నేడు 44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభవేళ
"ప్రజాశక్తి" యాజమాన్యానికి, సిబ్బందికి
శుభాకాంక్షలు తెలుపుతూ..
పి.ప్రభాకర్ యాదవ్
టిడిపి సీనియర్ నాయకులు,
గోకులం-పుట్టపర్తి
పి.వెంకటరమణమ్మ
10 వార్డు కౌన్సిలర్,
భూమిగాని రాజశేఖర్ యాదవ్
టిడిపి సీనియర్ నాయకులు,
గోకులం-పుట్టపర్తి


ప్రజాశక్తికి
44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు...
ప్రజాశక్తి సిబ్బందికి, పాత్రికేయులకు,
అధికారులకు, నాయకులకు,
ప్రజాశక్తి 44వ వార్షికోత్సవం
శుభాకాంక్షలు...
ఓబులేసు
ఇంజనీర్ ఆర్.డబ్ల్యూ.ఎస్


ప్రజాశక్తికి 44వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
నిరంతరం ప్రతి అక్షరం ప్రజల పక్షాన నిలుస్తూ..
నిజాలు నిర్భయంగా తెలియజేస్తూ..
దినదినాభివృద్ధి చెందుతున్న
"ప్రజాశక్తి" దినపత్రిక నేడు 44వ
వార్షికోత్సవం జరుపుకుంటున్న
శుభ సందర్భంగా యాజమాన్యానికి,
సిబ్బందికిశుభాకాంక్షలు తెలుపుతూ..
నియోజకవర్గం ప్రజలకు ధన్యవాదాలు
తెలుపుకుంటూ..
షేక్‌దిల్‌షాద్‌బి
మాజి కౌన్సిలరు,
గోకులం-పుట్టపర్తి.
ఎస్.మహమ్మద్ రఫీ
టిడిపి రాష్ట్ర మైనార్టీ విభాగము
కార్యదర్శి, పుట్టపర్తి.


ప్రజాశక్తికి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు...
జిల్లా అధికారులకు,
పాత్రికేయులకు,
ప్రజాశక్తి
యాజమాన్యనికి
వార్షికోత్సవ
శుభాకాంక్షలు...
డాక్యుమెంట్ రైటర్స్
బుక్కపట్నం


ప్రజాశక్తికి 44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ప్రతి అక్షరం ప్రజల పక్షాన నిలుస్తూ..
నిజాలు నిర్భయంగా ప్రకటిస్తూ..
సమాజాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న
"ప్రజాశక్తి" దినపత్రిక దినదినాభివృద్ధి చెందుతూ
నేడు 44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న
శుభవేళ యాజమాన్యానికి,
సిబ్బందికిశుభాకాంక్షలు తెలుపుతూ..
ఎమ్.నాగరాజు
శ్రీ సత్యసాయి జిల్లా
నాయి బ్రాహ్మణ సేవా సంఘం
యు.బి.గురుస్వామి
రాష్ట్ర నాయి బ్రాహ్మణ
సేవా సంఘం నాయకులు.